


Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమాంతరం

సంపుటి: 81 • సంచిక: 46 • 12-11-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



మార్పు నిజమే కాని ఇప్పుడు కాదు!




ముఖ్యమంత్రి రోశయ్యను పదవి నుంచి తొలగించి, ఏదో ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా పంపుతారని టీవీ ఛానళ్లు రెండు రోజులుగా రచ్చ రచ్చ చేస్తున్నాయి. ఒక ఇంటర్నెట్ వెబ్‌సైట్ వార్తను ఆధారంగా చూపి ఈ కథలు అల్లుతున్నాయవి. ఇవి కేవలం కట్టు కథలు మాత్రమే. ఇప్పటికిప్పుడు రోశయ్యను మార్చే ఉద్దేశంలో కాంగ్రెస్ అధిష్టానం లేదు.

అందుకు కారణం – ప్రత్యామ్నాయం లేకపోవడం మాత్రమే. రోశయ్య మీద ఢిల్లీ పెద్దలెవరికీ భ్రమలు లేవు. ఆయన్ను కొనసాగిస్తే పార్టీకి నష్టమే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదన్న నిజం వారికి తెలుసు. 35 ఎమ్పీ స్థానాలిచ్చే రాష్ట్రాన్ని చేజేతులా వదలుకోవడం ఇష్టం కాదు. కానీ ఇప్పటికిప్పుడు చేయగల్గింది ఏదీ లేదు. మారిస్తే ఎవరిని పెట్టాలో తెలియని అయోమయం. కేంద్ర హోంమంత్రి చిదంబరం ఒక రాష్ట్ర నేతతో వ్యాఖ్యానించినట్లు, శాసనసభలో అందరూ రెడ్లే కానీ, ముఖ్యమంత్రికి తగినవాడు ఒక్కడూ లేడు. జైపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిల పేర్లు మాత్రమే ఒక దశలో పరిశీలనకు మిగిలాయి. కానీ ఇటు జగన్ గొడవ, అటు తెలంగాణ గోల సంభాళించుకొనే సత్తా వీరికి వుందా అనే సందేహంతో పక్కన పెట్టేశారు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక తర్వాత రాష్ట్రంలో తీవ్ర రాజకీయ సంచలనాలుంటాయి. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోగల్గిన నాయకుడు ఢిల్లీ పెద్దలకు కన్పించడం లేదు. రోశయ్యకూ ఆ సామర్థ్యం లేదని వారికి తెలుసు. అందువల్ల అప్పటి పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రపతి పాలన వంటి నిర్ణయం తీసుకోవడం ఒక్కటే మార్గమని ఢిల్లీ పెద్దల భావన. రోశయ్య మార్పు జరుగుతుందన్న మాట నిజమే కానీ అది ఇప్పటికిప్పుడు జరగదు.

రోశయ్య కూడా అందుకు సిద్ధపడే వున్నాడు. ముఖ్యమంత్రిగా ఆయన సుఖపడుతున్నది పెద్దగా లేదు. కెవిపి.రామచంద్రరావు చేసే వ్యాపార ఒప్పందాలు, వాటితో వచ్చే సొత్తు మూటలు తప్ప మరే సంతోషమూ లేదాయనకు. ఇష్టంలేని మంత్రులతో కష్టమైన కాపురం చేస్తున్నాడు. ఒక్క గాదె వెంకటరెడ్డిని తప్ప మరెవ్వరినీ నమ్మే స్థితిలో లేడాయన. ఆ అక్కసును వెటకారంతో, వ్యాఖ్యానాలతో వ్యక్తం చేస్తూనే వుంటాడు. ముఖ్యమంత్రి మీద ప్రతిపక్షాలు విమర్శలు చేస్తే, మంత్రులందరూ కలిసి ఎదురుదాడి చేయడం ఆనవాయితీ. కానీ రోశయ్య విషయంలో ఏ ఒక్క మంత్రి కూడా ఆ చొరవ చూపడం లేదు. అసలాయన్ను ముఖ్యమంత్రిగా చూడడమే లేదు చాలా మంది మంత్రులు. తన మనసులో మాట చెప్పుకోవడానికి మంత్రివర్గంలో ఒక్కరూ స్వంత మనిషి లేడే అని క్షోభ పడుతున్నారాయన.

ఈ నేపథ్యంలో తన పదవి కాపాడుకోవడానికి రోశయ్య చిన్నపాటి ప్రయత్నం కూడా చేయడన్నది నిజం. వుంటే వుంటాడు. పోతుంటే బాధపడడు. సరైన ప్రత్యామ్నాయం దొరికే వరకు ఢిల్లీ పెద్దలు కూడా ఆయన మార్పు తలపెట్టక పోవచ్చు. మహారాష్ట్రతో మనకు పోలిక లేదు. అక్కడ ఒకరు పోతే, ఆ ఖాళీని భర్తీ చేయడానికి పది మంది లైన్లో నిలబడి వుంటారు. ఇక్కడ అంత మాత్రం మనిషి లేడు.

కార్టూన్ స్కేప్



ఈ గొడవంతా ఎందుకు మేడం! ఇది ఎవరి కాళ్లకు అతుక్కుపోతే వాళ్లదే 'ఐరన్ లెగ్'...!

వైశ్య ముఖ్యుల ఆశ్రయంలో పోతుల సురేష్

పరిటాల రవి చేతిలో ఎకె 47 తుపాకి వలె వ్యవహరించిన అనంతపురం జిల్లా మాజీ నక్సలైట్ నేత పోతుల సురేష్ వున్నట్లుండి పోలీసుకి దొరికిపోవడం రాష్ట్రమంతా సంచలనం సృష్టించింది. పరిటాల రవి హత్యనాటి నుంచి అజ్ఞాతవాసంలో బ్రతుకుతున్నాడు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అంతటివాడే, పోతుల సురేష్ పట్ల జాగ్రత్తగా మెలిగేవాడని చెప్తారు. వైఎస్ హయాంలో, పోలీసు అధికారులు పోతుల సురేష్ కోసం గాలించని వూరు లేదు. దొరికితే ఎన్‌కౌంటర్ ఖాయమనే భయంతో ఇంతకాలం ఎవరికీ దొరకకుండా తప్పించుకొని తిరిగాడు. అంతటి జాగ్రత్తపరుడు, వున్నట్లుండి పోలీసుకు దొరికిపోవడం అందరికీ ఆశ్చర్యం కల్గించింది. ఇది అరెస్ట్ కాదు, లొంగుబాటు అని ఒక వాదన. కర్నూలు జిల్లాకు చెందిన ఒక వైశ్య ప్రముఖుడు, ముఖ్యమంత్రి రోశయ్యతో ముందుగా మంతనాలు జరిపి, అన్ని ఏర్పాట్లుచేసి, లొంగుబాటు చేయించాడని చెప్తున్నారు. పోతుల సురేష్ తమ పక్కన వుంటే, రాజకీయంగా ప్రయోజనం తోపాటు, వైఎస్.జగన్‌కు ఒక చెక్ పెట్టినట్లు వుంటుందనే ఆశతోనే ఈ నిర్ణయం తీసుకొన్నారని వినికిడి. సురేష్ భార్య వైశ్య కులానికి చెందిన మహిళ కావడంతో, ఆమె ద్వారా మంతనాలు నడిచాయని తెలుస్తున్నది. సురేష్‌ను కేసుల నుంచి త్వరగా బయటవేయడానికి వైశ్య ప్రముఖులు ఒక నిధిని కూడా ఏర్పాటు చేశారని చెప్తున్నారు.

సురేష్‌కు ముఖ్యమంత్రి రోశయ్య పరోక్ష ఆశ్రయం వుందన్న వార్తల పట్ల అనంతపురం జిల్లా నేత జెసి.దివాకర్‌రెడ్డి చాలా ఆగ్రహంతో వున్నట్లు చెప్తున్నారు. ఇటువంటి వారికి రాజకీయ బలం సమకూర్చేస్తే అనంతపురం జిల్లా మరొకసారి అల్లకల్లోలమౌతుందని బాధ పడుతున్నారాయన.

అహ్మద్‌పటేల్ అయితే ఏమన్న జగన్!

కాంగ్రెస్ రాజకీయాలలో సోనియాగాంధీ తర్వాత స్థానం అహ్మద్ పటేల్‌ది. కొమ్ములు తిరిగిన మగధీరులు కూడా ఆయన ప్రాపకం కోసం పడిగాపులు కాస్తూ వుంటారు. అటువంటి అహ్మద్ పటేల్ నుంచి ఫోన్ కాల్ వస్తే బదులు చెప్పడానికి నిరాకరించాడు వైఎస్.జగన్. ఎఐసిసి సదస్సులో వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి సంతాప తీర్మానం పెట్టకపోవడం పట్ల రాష్ట్రంలో జగన్ వర్గం నిరసన వ్యక్తం చేసింది. టీవీ ఛానళ్లలో అదొక చర్చగా మారింది. దీనివల్ల పార్టీకి నష్టం జరుగుతుందని భావించిన అహ్మద్ పటేల్, కెవిపికి ఫోన్ చేసి, ఈ గొడవ ఇంతటితో ఆపేయమని హెచ్చరించాడట. అయితే, కెవిపి చాలా తెలివిగా ఆ మాట జగన్‌కు చెప్పమని సూచించాడట. వెంటనే అహ్మద్ పటేల్ నుంచి జగన్‌కు ఫోన్ వెళ్లింది. ఆ సమయంలో నాయుడుపేట ప్రాంతంలో యాత్రలో వున్నాడు జగన్. సెక్యూరిటీవాళ్లు ఫోన్ తెచ్చి, అహ్మద్ పటేల్ లైన్‌లో వున్నాడని చెప్తే, అహ్మద్ పటేల్ అయితే ఏమని విసుక్కొన్నాడట జగన్. ఆ ఫోన్ కాల్‌కు బదులు చెప్పడానికి నిరాకరించాడు. పార్టీలో వుండి, ప్రాపకం కోసం ప్రాకులాడే వారికి అహ్మద్ పటేల్ వంటి వారిని చూస్తే వణుకు. పార్టీతో నాకేమి పననే తెగింపుకు వచ్చిన జగన్ వంటి వారిని ఇటు వంటి ఫోన్లు ఏమి చేయగలవు చెప్పండి?



రాష్ట్రానికొక నీతా?

బొంబాయి నగరంలో కార్గిల్ అమరవీరుల కోసం నిర్మించిన ఆకాశ సౌధాన్ని బంధుప్రీతితో దుర్వినియోగం చేసి నందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్‌ను గద్దె దించింది కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ. మొత్తం సైనిక బలగాల ప్రతిష్టకు మసక వేసిన ఈ కుంభకోణం పట్ల కాంగ్రెస్ పార్టీ చూపిన స్పందన యావత్ జాతి ప్రశంసలు అందుకొంటున్నది. బిజెపి, సిపిఎం వంటి ప్రతిపక్షాలు కూడా నోరు మూసుకోవలసిన పరిస్థితి కల్పించింది సోనియా గాంధీ. దేశంలో ఇటీవలి కాలంలో జరిగిన, జరుగుతున్న అవినీతి కృత్యాలతో పోలిస్తే ఆదర్శ్ ఆకాశసౌధం కుంభకోణం చాలా చిన్నది. బొంబాయి నగరంలో అత్యంత ఖరీదైన కొలాబా ప్రాంతంలో సైన్యానికి ఎకరాలోపు ఖాళీ స్థలముంది. అందులో కార్గిల్ అమరవీరుల కుటుంబాలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని తలపెట్టారు. దాన్ని అందరూ స్వాగతించారు. అయితే ఇది చాలా విలాసవంతమైన ప్రాంతం కావడం, ముఖేష్ అంబానీ వంటి ప్రపంచస్థాయి కుబేరులు నివసించే ప్రాంతం కావడంతో రాజకీయవాదులు, అధికారుల కళ్లు దీనిపై పడ్డాయి. మామూలు మనుషులెవరూ ఇక్కడ ఇళ్లు కట్టుకోవాలని కల కూడా కనలేరు. అపార్ట్‌మెంట్లలో అడుగు ధర లక్ష రూపాయల వరకు పలుకుతుంది ఇక్కడ. అంత విలాసవంతమైన ప్రాంతంలో కారుచవకగా ఇళ్లు కొట్టేయడానికి రియల్ ఎస్టేట్ రాబందులు కార్గిల్ అమరవీరుల సౌధం మీద వాలి పోయాయి. వారికి ముఖ్యమంత్రుల స్థాయి నుంచి లోపాయకారీ మద్దతు లభించింది. అశోక్ చవాన్ తన అత్తగారికి ఒక ఇల్లు కేటాయింప జేశారు. కొందరు సీనియర్ ఐఎఎస్ అధికారులు తమ బంధువులకు ఇళ్లు సంపాదించారు. మరీ హేయమైన విషయం ఏమిటంటే నీతికి, నిజాయితీకి, నిబద్ధతకు కొలమానంగా బ్రతకవలసిన సైన్యాధికారులు కూడా తమ దురాశను ప్రదర్శించారు. ఏకంగా ఒకరికి ముగ్గురు సర్వ సైన్యాధికారులు ఈ పాపంలో వాటా పంచుకొన్నారు. అగ్ని పునీత సీత వలె పరమ పవిత్రంగా వుండవలసిన సైన్యం అవినీతికి పాల్పడిందన్న నింద పైన పడడంతో యావత్ దేశంలో కలకలం రేకెత్తింది. రక్షణ మంత్రి ఎ.కె.ఆంటోనీ చాలా ఆవేదన చెందాడు. దీనితో సోనియా గాంధీ రంగంలోకి దిగి ప్రాథమిక దర్యాప్తు జరిపించి, ముఖ్యమంత్రి అశోక్ చవాన్ చేత రాజీనామా చేయించారు. పనిలో పనిగా కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సురేష్ కల్మాడీని కూడా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి పదవి నుంచి తొలగించారు. ఈ రెండు నిర్ణయాలు ఉన్నతస్థాయిలో జరిగే అవినీతికి చెంపదెబ్బ వంటివి. వీటితో దేశాన్ని చెద పురుగు వలె పట్టి పీడిస్తున్న అవినీతి భూతం నిర్మూలన అవుతుందని భావించలేము కానీ, భవిష్యత్తులో అటువంటి అపభ్రంశపు పనులకు పాల్పడే రాజకీయవాదులు కొంచెం వెనుకా ముందు ఆలోచన చేయక తప్పని పరిస్థితి కల్పిస్తున్నాయి ఈ నిర్ణయాలు.

జమీన్‌రైతు

సైన్యం ప్రతిష్ట ముడిపడి ఉండడంతో అంతగా ప్రాధాన్యత సంతరించుకొన్నదని కానీ, లేకుంటే ఆదర్శ్ ఆకాశ సౌధం అవినీతి విలువ పెద్ద లెక్కలోనిది కాదు. మన రాష్ట్రంలో గత ఆరేళ్లుగా అంతకు కొన్ని వేల రెట్లు అధికంగా అవినీతి గోల్మాల్ వ్యవహారాలు యదేచ్ఛగా నడిచి పోతున్నాయి. ఒక్క ఎమ్మార్ ప్రాపర్టీస్ భూ కేటాయింపులోనే మన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేతలు పది వేల కోట్ల రూపాయల విలువైన కుంభకోణానికి పాల్పడ్డారని తేలింది. ఓబుళాపురం, బయ్యారం ఇనుప ఖనిజం గనులు, జలయజ్ఞం కాంట్రాక్టులు, జెన్‌కో బొగ్గు, ఎస్ఇజడ్ ప్రాజెక్టులు వంటి వాటన్నింటినీ కలిపి కూడితే గత ఆరేళ్లలో మన రాజకీయవాదులు భోంచేసిన ప్రజాధనం ఎన్ని లక్షల కోట్ల రూపాయలుగా లెక్క తేల్తుందో ఊహించలేము. ఆరు కోట్ల రూపాయల అపార్ట్‌మెంట్ విషయంలో బంధుప్రీతికి పాల్పడిన మహారాష్ట్ర ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించిన సోనియా గాంధీ ఆంధ్రాలో మాత్రం తన పార్టీలోని అవినీతిపరులను యదేచ్ఛగా వదలి పెట్టడం విచిత్రం. అవినీతి విషయంలో రాష్ట్రానికొక నీతి ఎందుకు పాటిస్తున్నారో ప్రజలకు వివరణ ఇవ్వవలసిన అవసరం వుంది.

జనవాక్కు

సుప్రీంగా సోనియా!

బలహీనురాలుగా, విదేశస్తురాలిగా బిజెపి వర్ణించిన కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీ దేశంలో సుప్రీం కమాండర్‌గా ఎదిగిపోయారు. ఆమె ముందు నిలబడ గల స్వపక్ష, విపక్ష నేతలు ఒక్కరూ కానరావడం లేదు. దేశంలో ఆమె అనుకున్నదే శాసనం. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలన్న ఏకైక లక్ష్యంతో ఆమె వేస్తున్న అడుగులు నిజమయ్యే రోజులు ఎంతో దూరంలో లేవు. ఎఐసిసి సదస్సులో దివంగత వైఎస్ వంటి జనాకర్షణ గల నేత పేరు ప్రస్తావించ లేదంటే కారణం సోనియా నిర్ణయమే. ప్రణబ్ ముఖర్జీకి రాష్ట్రపతి పదవి ఇవ్వాలన్నా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్‌ను నిశ్శబ్దంగా ఇంటికి పంపాలనుకొన్నా సోనియాగాంధీ క్రీగంటి చూపుతోనే పని జరుగుతుంది. వైఎస్ జగన్ ఈ విషయం తెలుసుకొని మసలు కొంటే కొన్నాళ్ల తర్వాతైనా రాష్ట్ర ముఖ్యమంత్రి కాగలడు.

వాస్తు రామచంద్ర నెల్లూరు

బ్యాంకులు రుణాలివ్వాలి!

ప్రజలకు నేరుగా రుణాలు ఇవ్వవలసిన బ్యాంకులు ఆ బాధ్యతను మరచి సూక్ష్మరుణ సంస్థలకు వేల కోట్లలలో రుణాలు ఇస్తున్నాయి. సూక్ష్మరుణ సంస్థలు ఆ రుణాన్ని తిరిగి ప్రజలకు అధికవడ్డీకి ఇచ్చి అధిక లాభాలు గడిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం సూక్ష్మరుణ సంస్థలపై మారిటోరియం విధించాలి. డబ్బులు వసూలు చేసే వాయిదాను వారానికి కాకుండా నెలకు ఒకసారి వుండేలా చేసి అధికవడ్డీని తగ్గించాలి. రుణ సంస్థల ప్రతినిధుల ఒత్తిడిని తగ్గించాలి. బ్యాంకులే నేరుగా రుణాలు ఇస్తే ఈ సమస్య తీరుతుంది.

డి.రాజేంద్రప్రసాద్ నెల్లూరు

ఇందిరమ్మ ఇళ్ల కోసం రుణగ్రస్తులవుతున్నారు

సూక్ష్మరుణ సంస్థల వద్ద అప్పులు చేసి తిరిగి చెల్లించలేక జనం అల్లాడుతున్నారు. ఈ సంస్థల వద్ద అప్పులు తీసుకొనేవారు పేదలే. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వాటిని కట్టుకోను సకాలంలో రుణవాయిదాలు చెల్లించడం లేదు. దీని వల్ల మరో గత్యంతరం లేక వీరంతా సూక్ష్మరుణ సంస్థల గడప తొక్కక తప్పదం లేదు. అధిక వడ్డీలకు తీసుకొంటున్న రుణాలను తిరిగి చెల్లించలేక ఇబ్బందుల్లో పడిపోతున్నారు. సూక్ష్మరుణ సంస్థల వద్ద ప్రస్తుతం

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

16-11-1940
పేజీలు : 16 వెల: అణా

దేశ రక్షణ చట్టం క్రింద నిర్బంధ పరంపర!

పత్రికలపై, ముద్రణా యంత్రాలపై నిర్బంధములు – ఇంటర్నమెంటులో తప్పించుకున్న వారి ఆస్తులపై వారంట్లు – ఆయుధాలు, మందుగుండు సామాగ్రి మీద అంక్ష – గాంధీజీ ప్రకటన – 'హరిజన' పత్రిక ఆపుదల.

అరెస్టు

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారిని చీయోకీ స్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. ఈ సందర్భంలో జమీన్ రైతులో వ్రాసినదీ పద్యం–

చేతులా లేవు మ్రొక్క పూజించుటకును
పువ్వులా కోయరాదట పువ్వు తోట
వ్యాక్సునూనోపయోగమును పడవలదు
మనసు చేతనే మా బ్రాతృమాన్య చరిత
అర్చనము సేతుమిక నెవరడ్డు మాకు

–నీ తమ్ములు.

అవీ – ఇవీ

న్యూయార్కులోని ఒక వృక్ష శాస్త్రజ్ఞుడు సీమ వంగ, బంగాళదుంప మొక్కలను రెంటినీ కలిపి, ఒక కొత్త మొక్కను తయారు చేశాడు. దీనిపేరు 'పొడటో' లేక 'టొపొటో' ఇది కాచే ఫలములు స్థూలకాయములను సూక్ష్మంగా మార్చడంలో సాయపడునట.

50 ఏళ్ల క్రితం ఈవారం

11-11-1960
పేజీలు: 12 వెల: 0-20 న.పై

అమెరికా అధ్యక్షుడు

9వ తేది రాత్రి 10.45 వరకు ఐన లెక్కింపును బట్టి అమెరికా అధ్యక్ష ఎన్నికలో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కెన్నడీకి 3,33,39,148 ఓట్లు(ఎలక్టరల్ ఓట్లు 303 – 23 రాష్ట్రాలు); రిపబ్లికన్ అభ్యర్థి నిక్సన్‌కు 3,30,16,402 ఓట్లు (ఎలక్టరల్ ఓట్లు 185 – 24 రాష్ట్రాలు) వచ్చినవి.

కెన్నడీ విజయానికి యిటు కమ్యూనిస్టు దేశాలు, అటు పశ్చిమ రాజ్యాలు; తటస్థ దేశాలు తమ హర్షాన్ని ప్రకటించినవి.

విపరీత వర్షాలు

స్వాతి కార్తెలో ఈ నెల ప్రారంభంలో పట్టిన వర్షం ఇప్పటికీ విడువలేదు. మరీ 6వ తేది విశాఖ కార్తె పెట్టినప్పటి నుంచి ఈ రోజు వరకు కుండపోతగా వర్షం కురుస్తున్నది. ఈ వారంలో (4వ తేది నుంచి 10వ తేది వరకు) నెల్లూరులో 18 పదున్ల వర్షం కురిసింది. ఈ సంవత్సరారంభం నుండి ఇప్పటివరకు 46 పదున్ల వర్షం కురిసింది. మామూలుగా 40 పదున్లు మాత్రం కురుస్తుందట. మామూలు కంటే ఎక్కువ 6 పదున్లే అయినా, మొదటి నుండి లేకుండా, ఒక్కసారి యింత వర్షం కురవడంతో విపరీతమనిపిస్తున్నది. 11వ తేది ఉదయం నుండి నెల్లూరులో వర్షం చాలా ఎక్కువగా వున్నది. రోడ్ల మీద ఒక అడుగుపైన నీరు పారుతున్నది. నెల్లూరు చెరువు కలుజులు ఎత్తబడినవి. దీనివల్ల, విపరీత వర్షం వల్ల టౌన్‌లో ఫత్తేఖాన్‌పేట, రామమూర్తి నగర్ వగైరా తగ్గు ప్రదేశాలు, రంగనాయకులపేట జలమయమై పోయినవి. హరిజన బాలుర హాస్టలు మోకాటి లోతు నీటిలో వుంది. పూరిండ్లు వందలాదిగా కూలిపోయినవి.

సూళ్లూరుపేట వద్ద గండ్ల వల్ల, బ్రిడ్జి బలహీనత వల్ల నిన్నటి నుండి రైళ్ల రాకపోకలు నేరుగా సాగడం లేదు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, జనతాలు మాత్రం రేణిగుంట గుండా పోతున్నవి.

నెల్లూరు ముచ్చట్లు

సినీప్రియుల గగ్గోలు

నెల్లూరు నగరంలోని 17 సినిమా థియేటర్లలో ఒకేసారి ఏడు థియేటర్లు సరికొత్త హంగులు దిద్దుకోవాలంటూ మూత వేయడంతో సినిమాలను విపరీతంగా చూసే నెల్లూరీయులు తల్లడిల్లుతున్నారు. ప్రస్తుతం నడుస్తున్న పది థియేటర్లలోనూ న్యూటాకీస్, వినాయక థియేటర్లు అధ్వాన్న స్థితిలో వున్నాయి. నెల్లూరులో కొత్త మల్టీప్లెక్స్‌లు తయారవ్వను రెండేళ్లు పడుతుంది. ఈ రెండేళ్లలో ఎనిమిది థియేటర్లలోనే కష్టమైనా నష్టమైనా సినిమా చూడక తప్పని పరిస్థితులు ప్రేక్షకులకు తప్పడం లేదు.

రెచ్చిపోయిన గోపాలరెడ్డి

9వ తేది హైదరాబాద్‌లో జరిగిన పిసిసి విస్తృత సమావేశానికి తనను పిలవకపోవడం పట్ల డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డి తీవ్రంగా రెచ్చిపోయారు. 9వ తేది సాయంత్రం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి పిసిసి నాకిచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చాను. అయినా నాకు ఆహ్వానం పంపలేదు. నేనేం తప్పు చేశాను. 30ఏళ్లుగా పార్టీలో వున్నాను. కడప ఎమ్పీ జగన్మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణను నేనింతవరకు చూడలేదు. ఆయనను ప్రజలు ఆదరిస్తున్న తీరు పార్టీ నేలపాలు చేసుకోవడం బాగోలేదు. జగన్‌ను ఆంధ్ర రాష్ట్ర సిఎం కాకుండా ఏ శక్తీ అడ్డుకోలేదని తేల్చి చెప్పారు.

జగన్ దెబ్బకు జల్ తుఫాను జడిసిందా?

7వ తేది నెల్లూరు గాంధీబొమ్మ వద్ద జరిగిన వైఎస్ జగన్ ఓదార్పు యాత్ర ముగింపు సభలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒకటికి పదిసార్లు ఈ రోజు జగనో, జల్ తుఫానో తేలిపోవాలన్నారు. చివరికి ఆయన నోటివాక్కు నిజమయ్యింది. సభ ప్రారంభమైన పది గంటలకు ఓ మోస్తరుగా గాంధీబొమ్మ సెంటర్‌లో జనమున్నారు. 11 గంటల నుండి 12 గంటలలోపు చినుకు పడితే నేల మీద పడనట్లుగా ఈ ప్రాంతం జన సముద్రమయ్యింది. గాంధీబొమ్మ సెంటర్‌లో ఇప్పటివరకు జరిగిన సభల్లో జన ప్రభంజనం సృష్టించిన సభగా జగన్ సభ నిలచిపోయింది.

పాపం పిల్లల డాక్టర్!

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి కుడి భుజంగా వ్యవహరించే నగరంలోని ప్రముఖ చిన్న పిల్లల డాక్టర్ జడ్.శివప్రసాద్‌కు తెలుగుదేశం అధికార ప్రతినిధి పదవి కూడా వుంది. ఈ హోదాతో 9వ తేది రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఎన్‌టివి సినీ నటి రోజాతో నిర్వహించిన న్యూస్‌మేకర్స్ లైవ్ కార్యక్రమంలో ఇటీవల జగన్ జిల్లా పర్యటనలో ఆమె చేసిన వ్యాఖ్యలపై అనవసరంగా మాట్లాడి చిక్కుల్లో పడ్డాడు. అధికార ప్రతినిధి అయినా నోరులేని డాక్టర్ రోజాను ప్రశ్నించి ఆమె చేత నానా మాటలడిగించుకున్నాడు. రోజుకు 200 మంది పిల్లలను తక్కువగా కాకుండా చూసే బిజీ డాక్టర్ గబ్బు రాజకీయాల్లోకి వచ్చి అనవసరంగా మాట పడవలసిన అవసరమెందుకో?

జల్ తుఫాను నష్టం 100 కోట్లు!

జల్ తుఫాను మూలంగా జిల్లాలో వంద కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. 8వ తేది కలక్టరేట్‌లో మంత్రి మాట్లాడుతూ తీర ప్రాంతంలోని 13 మండలాల్లో దీని ప్రభావం పడిందన్నారు. 1300 హెక్టార్లలో వరినారు, 65 హెక్టార్లలో అరటి, తమలపాకుల తోటలు, 98 పక్కా భవనాలు, 160 కచ్చా గృహాలు దెబ్బతిన్నాయన్నారు. నీటిపారుదల శాఖ, పంచాయితీరాజ్ శాఖ, రోడ్లు భవనాల శాఖలకు చెరువులు, రోడ్లు దెబ్బతినడం ద్వారా నష్టం వాటిల్లిందన్నారు. 8 మంది వర్షం, చలిగాలులకు చనిపోయినట్లు తహశీల్దార్‌లు నిర్ధారించినట్లు మంత్రి చెప్పారు. నెల్లూరు కార్పొరేషన్‌కు 17 కోట్లు, కావలి, గూడూరు, వెంకటగిరి మునిసిపాలిటీలకు కోటి రూపాయల వంతున వనరులు దెబ్బతిన్నాయన్నారు. చనిపోయిన వారికి ప్రభుత్వం తరపున రెండు లక్షల రూపాయలు సాయం అందజేస్తామన్నారు.

జగన్‌ను విస్మరిస్తే అంతే!

రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని విస్మరిస్తే సోనియాగాంధీ ఒంటరిగా మిగిలిపోతారని నెల్లూరు రాజీవ్ భవన్ నేతలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. 7వ తేది నెల్లూరులో జగన్ ఓదార్పు యాత్ర ముగింపు బ్రహ్మాండమని 8వ తేది వీరు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఓదార్పు యాత్రను చూసైనా అధిష్టాన వర్గం కళ్లు తెరచి, ప్రజాదరణ కల్గిన నేత అయిన జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర బాధ్యతలు అప్పగించాలన్నారు. నెల్లూరులో జగన్ సభ నభూతో నభవిష్యతి అన్నట్లుగా జరిగిందని దీనికి సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పారు.

చందాదారులకు మనవి

- **చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.**
- **'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి రూపంలో మాత్రమే పంపగలరు. చెక్కులు స్వీకరించబడవు.**
- **మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.**

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

సోమిరెడ్డి × లక్ష్మీపార్వతి

నెల్లూరులో జరిగిన వైఎస్ జగన్ ఓదార్పు యాత్ర ముగింపు సభకు లక్ష్మీపార్వతి, రోజావంటి ఐరన్‌లెగ్‌లను ఎందుకు పిలిచారంటూ తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వాఖ్యానించడంపై మాటల యుద్ధం మొదలయ్యింది. ఎన్టీరామారావు జీవితంలోకి లక్ష్మీపార్వతి వచ్చాక ఆయనకు శని పట్టుకొందని, నటి రోజా వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలసిన వారం తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసునని చంద్రమోహన్‌రెడ్డి తన సహజ ధోరణిలో వ్యాఖ్యానించారు.

ఈ విషయమై హైదరాబాద్‌లో లక్ష్మీపార్వతి మాట్లాడుతూ మహిళల పట్ల ఆయన అంత నీచంగా మాట్లాడతాడా? అతనిది మహిళల కాళ్లు పట్టుకొనే జాతి. ఎన్టీఆర్‌ను నేను పెళ్లిచేసుకొన్నాక ఆయన ఆరోగ్యం కుదుటపడింది. చంద్రమోహన్‌రెడ్డి రెండుసార్లు వరుసగా సర్వేపల్లిలో ఓడిపోయాడు. ఆయన తరపున ప్రచారం చేసిన ఆయన భార్యది ఐరన్‌లెగ్‌నా? రోజాను నిందిస్తాడా ---కోరంటూ అడ్డూఆపూ లేకుండా సాగిపోయారామె. ఈ వ్యవహారమై నోరు జారినట్లు టివి-9లో 9వ తేది మధ్యాహ్నం జరిగిన 'లైవ్' కార్యక్రమంలో లక్ష్మీపార్వతి ఒప్పుకొన్నారు. చంద్రమోహన్‌రెడ్డి ఆమెను ఉద్దేశించి తాను తిట్టిన తిట్లు వెనక్కు తీసుకొంటున్నట్లు ప్రకటించారు.

మూర పూలు 20 రూపాయలు!

ధరలు నానాటికీ పెరగడమే కాని తగ్గే రోజులు కావివి. కార్తీకమాసంలో వ్రతాలు, పూజలు చేసుకొనే మహిళలకు పూల ధరలు అందుబాటులో లేవు. నెల్లూరు మహిళలు ఇష్టంగా కొప్పులో పెట్టుకొనే సెంటుజాజులు మూర 20 రూపాయలు అమ్ముతుండగా మల్లెపూలు 15 రూపాయలు పలుకుతున్నాయి. కనకాంబరాలైతే మూర 30 రూపాయలయ్యాయి. సోమవారం, శుక్రవారం రోజుల్లో ఈ ధరల్లో మార్పులు చోటు చేసుకొంటున్నాయి.

మల్టీప్లెక్స్‌లుగా మూడు హాళ్లు!

రాష్ట్రంలోనే అందమైన సినీ థియేటర్లుగా పేరుగాంచిన కృష్ణ, కావేరి, కళ్యాణిలను 7వ తేది మూత వేశారు. ఈ థియేటర్ల స్థానే అత్యాధునిక మల్టీప్లెక్స్ థియేటర్ల నిర్మాణం చేయనున్నారు. 1978 సంవత్సరంలో స్వర్గీయ మాగుంట రాఘవరెడ్డి ఈ మూడు హాళ్ల నిర్మాణం చేపట్టారు. 1980లో వీటిని ఎన్టీరామారావు, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, విజయమాల్యా చేతుల మీదుగా స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి ప్రారంభింపజేశారు. 30 ఏళ్ల తర్వాత తిరిగి వీటికి ఆధునికతను సంతరించి పెట్టబోతున్నారు మాగుంట శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రెడ్డిలు. ఆట ఆగిన ఈ థియేటర్లు స్వల్పకాలంలోనే సరికొత్త హంగులతో తమ ముందుకు రావాలని నెల్లూరు ప్రేక్షకులు కోరుకొంటున్నారు.

కరెంట్ సరఫరాలో తేడా!

డిమాండ్‌ను మించి విద్యుత్ ఉత్పత్తి అవుతున్నా నెల్లూరు నగరంలో దీని సరఫరాలో ప్రతినిత్యం గందరగోళం తప్పడం లేదు. అత్యాధునిక పరికరాలు అందుబాటులోనికి వచ్చిన నగరంలో కొన్ని చోట్ల హైఓల్టేజి, మరికొన్ని చోట్ల లోఓల్టేజి సాగుతుంది. దీనివల్ల ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు కాలిపోయి ప్రజలు లబోదిబోమంటున్నారు. నెల్లూరులో నాణ్యమైన విద్యుత్ ప్రసారానికి ఎస్ఇ నందకుమార్ తగినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

వృద్ధుల ఆశ్రమానికి సాయం!

నెల్లూరు మైపాడుగేటు ప్రాంతంలోని శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధుల ఆశ్రమానికి మన్నెమాల అహల్యమ్మ లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. తన భర్త రాజగోపాలరెడ్డి జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని ఆశ్రమ నిర్వాహకుడు మురళీ కృష్ణ గ్రూపు హోటల్స్ అధినేత గ్రోసు గోపాలయ్యకు అందించారు.

నెల్లూరు మెడికల్ సొసైటీకి కొత్త కార్యవర్గం

నెల్లూరు మెడికల్ సొసైటీ ఛైర్మన్‌గా డాక్టర్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వై.కృష్ణమోహన్‌రావు, కోశాధికారిగా డాక్టర్ హజరత్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మెడికల్ సొసైటీ కార్యవర్గం నెల్లూరులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రతినెలా ఐఎంఏ సభ్యులైన డాక్టర్లకు వైద్య పునశ్చరణ తరగతులు నిర్వహిస్తుంది. వైద్యులు, వైద్యుల పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తుంది.

కార్తీకదీపం వెలిగించిన వివేకా!

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి కార్తీకమాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో 7వ తేది ఆకాశదీపం వెలిగించారు. కార్తీకమాస పూజల వల్ల పుణ్యం, పురుషార్థం లభిస్తాయన్నారు. మాజీ మేయర్ భానుశ్రీ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జడ్పీ ఛైర్మన్ సమీక్ష

జల్ తుఫాను నష్టాలపై జడ్పీ అధికారగణంతో ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కొరవ 14వ పేజీలో

బంగారం స్పెషల్ ఆఫర్

BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై సవరకు రూ.400/- తగ్గింపు. గ్రాముకు రూ.50/- తగ్గింపు. డైమండ్స్ పై 10% తగ్గింపు.

గోల్డ్ ప్యాలెస్

హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్, ఆచారివీధి, నెల్లూరు. ఫోన్: 2331133, 2327611

కబోర్ హోమ్

DARGAMITTA, NELLORE.

వాటర్‌ప్రూఫ్ ప్లైవుడ్, రెండు వైపులా సన్‌మైకా లేబరు, హార్డ్‌వేర్ మొత్తం కలిపి S.F.T.Rs.225/-

☎ 95506 82557, 6526129

వధువు కావలెను

30సం॥ భరద్వాజ ఉత్తరాషాడ 3వ పాదం, MSC., (CS) HCL Chennai. ఎత్తు 5.7 తెల్లని ద్రావిడ బ్రాహ్మణ వరునకు Software Professional Employee బ్రాహ్మణ వధువు కావలెను. శాఖ పట్టింపు లేదు.

: వివరములకు :

SVS. KOTESWARA RAO, Nellore.

92476 85582

సిపిఎంలో సంక్షోభం!

● కార్యదర్శిగా భానురాజు స్థానంలో మళ్లీ వెంకయ్య.





జల్ తుఫాను హడావుడిలో సిపిఎం కార్యకర్తలు పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలిస్తూ బిజీగా వుండగా ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి టి.పి.భానురాజును తప్పిస్తూ రాష్ట్ర నాయకులు తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశమయ్యింది. తుఫాను వేళ నెల్లూరు వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు, ఆ పార్టీ మాజీ ఎమ్పీ పెనుబల్లి మధు పార్టీ జిల్లా కార్యవర్గంతో సుదీర్ఘ మంతనాలు జరిపి భానురాజు స్థానంలో జక్కా వెంకయ్యను తిరిగి నియమిస్తూ నిర్ణయం తీసుకొన్నారు. భానురాజు సిపిఎం పార్టీలో సీనియర్ నాయకుడు. పైపెచ్చు మూడుసార్లు నెల్లూరు పార్లమెంట్ స్థానానికి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేశారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు రూరల్ స్థానానికి సిపిఎం అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. రెండవ దఫా సిపిఎం జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్న భానురాజు పార్టీ కార్యకర్తలకు దశ దిశ నిర్దేశించ లేకపోతున్నాడన్న కారణంతో తొలగించారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భానురాజు హయాంలో పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా జరగడం లేదన్న భావనకు సైతం పార్టీ వచ్చినట్లు తెలిసింది. ఎస్ఇజడ్‌లు, కృష్ణపట్నం పోర్టు, ధర్మల్ స్టేషన్ల ఏర్పాటు వ్యవహారంలో పార్టీ ఉద్యమ పంథాలో ఊపు తగ్గింది. నెల్లూరు ఇందిరమ్మ గృహాల అవినీతి, ఎసి మార్కెట్ వద్ద పేవ్‌మెంట్‌పై బుట్టల్లో వ్యాపారం చేసుకొనే పార్టీ సానుభూతి పరుల తొలగింపు, కార్పొరేషన్‌లో అధికార పార్టీ అవినీతిని ఎండగట్టడంలో పార్టీ శ్రేణులను భానురాజు సరైన ధోరణిలో నడపలేక పోయారన్న అపప్రధను మూట గట్టుకొన్నారు. అధికారులు, పాలకవర్గం, రాజకీయ నాయకులకు జక్కా వెంకయ్య హయాంలో సిపిఎం పార్టీ అంటే భయభక్తులుండేవి. ఈగలు సైతం ఆ పార్టీ ఆఫీసుపై వాలాలంటే హడల్ అనే ప్రచారం వుండేది. అటువంటిది రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి సిపిఎం పార్టీని, రాష్ట్ర కార్యదర్శిని నోటికొచ్చినట్లు తిట్టినా ఊరకుండిపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నిర్లిప్తత ఆవరించింది. ఈ సమయంలో జక్కా వెంకయ్య అనారోగ్యం నుంచి కోలుకొని హుషారుగానే వుండడంతో ఆయన చేతికే పార్టీ పగ్గాలప్పగించారు. పార్టీ రాజకీయాల్లో డక్కామొక్కీలు తిన్న జక్కా వెంకయ్య జీవిత చరమాంకంలోనూ పార్టీకి పూర్వవైభవం తెచ్చే బాధ్యత స్వీకరించడం ఆ పార్టీ కార్యకర్తల్లో కొందరు హర్షించడం, మరికొందరు వ్యతిరేకించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

● వెనుకబడ్డ అధికార పార్టీ.

మార్చి నెలలో జరగబోయే శాసనమండలి ఎన్నికలకు సంబంధించి వివిధపార్టీలు, సంఘాలు అభ్యర్థులను ప్రకటించాయి. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరుగుతున్న ఎన్నికలకు ఇప్పటినుంచే పలువురు ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ రెండు నియోజకవర్గాలకు యుటిఎఫ్ అభ్యర్థులైన విరపు బాల సుబ్రహ్మణ్యం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి, దాచూరి రామిరెడ్డి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరి పదవీకాలం పూర్తి కావస్తుండడంతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. తిరిగి యుటిఎఫ్ అభ్యర్థిగా విరపు రెండోసారి ఎన్నికల గోదాలోకి దిగుతున్నాడు. రామిరెడ్డి తప్పుకోవడంతో ఆయన స్థానంలో తిరుపతికి చెందిన శ్రీనివాసులు రెడ్డి పోటీ చేస్తున్నాడు. తెలుగుదేశం తరపున పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీకి దిగిన ప్రముఖ న్యాయవాది దేశాయిశెట్టి హనుమంతరావు తిరిగి పోటీలో వున్నాడు. ఉపాధ్యాయుల తరపున బ్రహ్మయ్యనాయుడు బరిలో నిలుస్తున్నాడు. బిజెపి ప్రస్తుతానికి ఉపాధ్యాయ అభ్యర్థిగా సుధాకర్ రాజును ప్రకటించింది. మరో ఉపాధ్యాయ సంఘమైన ఎస్‌టియు ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి నాగరాజును, పట్టభద్రుల నుంచి పురుషోత్తంను ప్రకటించింది. అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించలేదు. స్వతంత్రులుగా పలువురు పోటీకి దిగుతున్నారు. దీనికి సంబంధించి ఓటరు నమోదుతోపాటు, పలు సంఘాలు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాయి.

జగన్ పద్మవ్యూహాన్ని చేధిస్తాడు!

సినీనటి రోజా ఆశాభావం.



ఓదార్పు ముగింపు సభలో మాట్లాడుతున్న నటి రోజా.

నెల్లూరు జిల్లాలో 23 రోజులపాటు 1200 కిలోమీటర్లు సాగిన కడప ఎమ్పీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర ముగింపు సందర్భంగా 7వ తేది గాంధీబొమ్మ సెంటర్‌లో జరిగిన బహిరంగసభలో పాల్గొన్న నేతలు జగన్‌ను తెగ పొగిడారు. సినీ నటుడు విజయచందరైతే చేతిలో మైకు పట్టుకొని పూనకమొచ్చిన వాడిలా ఊగిపోయాడు. జగన్... జగన్... జగన్‌కు జయం... ప్రభంజనం, జల్ తుఫాను కాదు... జగన్ తుఫాను... ఇది యువశక్తి... జనశక్తి... జగన్ శక్తి అంటూ ప్రాసలో సాగిపోయారు. ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి కన్నీళ్ల పర్యంతమవుతూ ఇచ్చిన మాట కోసం ఓదార్పు యాత్ర చేస్తున్న జగన్‌ను జనమే జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. నందమూరి లక్ష్మీపార్వతి పురాణాలు మేళవించి మాట్లాడుతూ తండ్రికి ఇచ్చిన మాట కోసం ఎన్నో కష్టాలు పడ్డ శ్రీరామచంద్రునితో జగన్‌ను పోల్చారు. జన ప్రభంజనం సృష్టించడంలో ఎన్టీఆర్, వైఎస్ఆర్‌లను జగన్ మించిపోయారని ఎల్లసిరి గోపాలరెడ్డి చెప్పారు. మాజీ మంత్రి కొండా సురేఖ మాత్రం రాజశేఖర్‌రెడ్డి కడుపున జగన్ పుట్టడం ఆయన చేసుకొన్న అదృష్టమని ఓ మొరటు తెలంగాణ సామెతను చెప్పారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ ఒక్కసారి కమిటైతే నా మాట నేనే విననన్న పోకిరి చిత్రంలోని హీరో మహేష్ బాబుతో జగన్‌ను పోల్చారు. నటి రోజా అయితే మరికాస్త ముందుకెళ్లి జగన్ ఓదార్పు యాత్ర చేస్తే కాంగ్రెస్ పార్టీకి నష్టమేమిటి? సచిన్ టెండూల్కర్ క్రికెట్ ఆడుతూ సెంచరీ కొడితే ఇండియాకు మంచిదేగా?? అదేవిధంగా జగన్ ఓదార్పుయాత్ర కాంగ్రెస్ పార్టీకి మంచి చేస్తుంది. జగన్ రాజకీయ పద్మవ్యూహంలో చిక్కుకున్నాడని ఆయనను అభిమన్యునితో పోలుస్తున్నారు. కానీ జగన్ పద్మవ్యూహాన్ని చేధించే అర్జునుడని ఆమె చెప్పుకొచ్చారు.

ఓదార్పు ముగింపు సభ అదుర్స్!

సత్తాచాటిన రాజీవ్‌భవన్



సభలో మాట్లాడుతున్న సిటీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ యాదవ్.

7వ తేది గాంధీబొమ్మ సెంటర్‌లో జగన్ ఓదార్పు యాత్ర ముగింపు సభ విజయవంతం అవడంతో రాజీవ్‌భవన్ సత్తా మరోసారి రాజకీయవర్గాలకు తెలిసింది. ఈ సభను విజయవంతం చేసేందుకు గత పక్షం రోజులుగా రాజీవ్‌భవన్ నిర్వాహకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రూప్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, మదన్‌మోహన్‌రెడ్డి బృందం తీవ్రంగా శ్రమించింది. నగరంలోని 50 డివిజన్లకు బాధ్యులను నియమించి ఈ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యేలా చేసింది. జల్ తుఫాను మూలంగా వాతావరణంలో వచ్చిన మార్పులను పట్టించుకోకుండా కార్యకర్తలు హాజరయ్యేందుకు ఆటోలు, మినీలారీలు ఏర్పాటు చేసింది. దీనివల్లే సభకు యువకులు, మహిళలు, చివరికి వృద్ధులు సైతం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వచ్చిన కార్యకర్తలను ఉత్తేజపర్చను వక్తలు మాట్లాడుతున్న సమయంలోనూ ఫలానా ప్రాంతం నుంచి ఫలానా నాయకుని నేతృత్వంలో వందలాది కార్యకర్తలు తరలివచ్చారని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మైకు తీసుకొని ప్రకటించారు.

సభ జరగడానికి ఐదు రోజుల ముందు నుంచే వందకు పైగా ఆటోలలో మైకుపెట్టి నగరంలో చేసిన ప్రచారానికి మంచి ఫలితం లభించింది. ఈ ఆనందాన్ని నగర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అనిల్‌కుమార్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. తుఫాన్ మూలంగా సభ సక్రమంగా జరుగుతుందో లేదోనన్న భయంతో రాత్రంతా నిద్ర రాలేదు. కానీ దేవుడున్నాడు. స్వర్గీయ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులున్నాయి. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన మీ అందరికీ పాదాభి వందనం. సుదీర్ఘ విరామం తర్వాత నెల్లూరులో బిసినైన నాకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారు వైఎస్. నా వయస్సు 28 ఏళ్లు. నా జీవితకాలంలో ఎన్ని ఇబ్బందులెదురైనా జగనన్నతోనే నడుస్తానని ఉద్వేగంగా ప్రకటించాడాయన. సభను రంజుగా నడపడంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రతిభను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిందే.

జనజీవనం అస్తవ్యస్తం!



కోటమిట్ట డౌన్‌లో వర్షపు నీటి మధ్య ఓ కుటుంబం.

పెను తుఫాను గండం తప్పినా నగరంలో పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించి పోయింది. అనేక ప్రాంతాల్లో నీళ్లు ఇళ్లను చుట్టుముట్టున్నాయి. జనశక్తి నగర్, పాత వేదాయపాళెం, మన్సూర్ నగర్, ఖుద్దూస్ నగర్, పరమేశ్వరి నగర్, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ, పడారుపల్లి ప్రాంతాలలో నివసించే ప్రజలు పలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇళ్ల చుట్టూ నిలచిన నీరుపోయే అవకాశం లేక పోవడంతో అస్తవ్యస్తమయ్యింది పలు కుటుంబాల పరిస్థితి. మినీ బైపాస్ రోడ్డును ఆనుకొని వుండే ప్రాంతాల పరిస్థితి మరీ ఘోరం. ఆర్ఎస్ఆర్ మునిసిపల్ హైస్కూల్, బివిఎస్ బాలికోన్నత పాఠశాల, రంగనాయకులపేట, భక్తవత్సలనగర్ పాఠశాలల్లో నీరు నిలచి పోయింది. కొండాయపాళెం గేట్ వద్దగల హాస్టళ్లలోకి నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సొచ్చింది.

తుఫాను బాధితులను ఆదుకొనేదెన్నడు?

మే నెలలో సంభవించిన 'లైలా' తుఫాను బాధితులకు ఇంతవరకు పరిహారం అందలేదు. ఇంతలో 'జల్' తుఫాన్ సంభవించింది. తుఫాన్ నష్టాలపై నివేదికలు తయారు చేయడం మినహా ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యింది.



వరద ఉధృతికి కొట్టుకపోయిన బోగోలు మండలం తాళ్లూరు రోడ్డు.

జిల్లా ప్రజలను వారం రోజులుగా తీవ్ర ఆందోళనకు గురి చేసిన "జల్" తుఫాన్ ఆదివారం రాత్రి తీరం దాటడంతో వూపిరిపీల్చుకున్నారు. ప్రధానంగా టి.వి.ఛానల్స్‌లో జల్ తుఫాన్ తీవ్ర ప్రాణ నష్టం, ఆస్తి నష్టాలను కలిగిస్తుందని ప్రచారం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురి కావాల్సి వచ్చింది. జిల్లా అధికార యంత్రాంగం కూడా ఈ దఫా ముందస్తు చర్యలు చేపట్టి తీర ప్రాంత మండలాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది.

తీర ప్రాంత మండలాల్లోని ప్రజలు మాత్రం గ్రామాలను విడిచి పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు నిరాకరించారు. కొన్ని గ్రామాల ప్రజలు మాత్రం సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. జిల్లాలో ప్రధానంగా కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, టిపిగూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, డి.వి.సత్రం, నాయుడుపేట, సూళ్లూరుపేట, తడ తదితర మండలాల్లో జల్ తుఫాన్ ప్రభావం కనిపించింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాత్రి ఏడు గంటలకు వర్షం నిలిచిపోగా గాలులు మాత్రం వీచాయి. తీరప్రాంత మండలాల్లో నియమించిన ప్రత్యేక అధికారులు అక్కడే మకాం వేసి పరిస్థితులను సమీక్షించారు.

అక్టోబర్ 29వ తేది నుంచి నవంబర్ 7వ తేది వరకు జిల్లాలో కురిసిన భారీవర్షాల కారణంగా దాదాపు 150 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు జిల్లా అధికార యంత్రాంగం ప్రాథమిక అంచనా వేసింది. నీటి పారుదల శాఖ, రోడ్లు భవనాలు, పంచాయితీరాజ్, ట్రాన్స్‌కో, ఉద్యానవన శాఖలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సముద్రపు అలల ఉధృతికి మత్స్యకారుల పడవలు, వలలు పూర్తిగా ఇసుకలో కూరుకుపోయి దెబ్బతిన్నాయి. వీటి నష్టాన్ని అంచనా వేసేందుకు సోమవారం నుంచి మత్స్యశాఖ అధికారులు తీరప్రాంతంలో పర్యటిస్తున్నారు. రోడ్లు, భవనాలశాఖకు సంబంధించిన రహదారులు చాలావరకు దెబ్బతినగా, నీటి పారుదలశాఖ, పంచాయితీరాజ్ చెరువులకు పలుచోట్ల గండ్లు పడ్డాయి.



ఇస్కపల్లి సముద్ర తీరాన మట్టిలో కూరుకపోయిన వలను బయటకు తీస్తున్న మత్స్యకారులు.

అధికారుల నిర్లక్ష్యం

గండ్లు పడిన రహదారులు, చెరువులను వెంటనే మరమ్మతులు చేసేందుకు అవసరమైన చర్యలుతీసుకోమని పలు దఫాలు జిల్లా కలెక్టర్ కె.రాంగోపాల్ సంబంధితశాఖ అధికారులను ఆదేశించినా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కొడవలూరు మండలం తలమంచి సమీపంలో వున్న పైడేరు వంతెన వద్ద అల్లూరు వైపు వెళ్లే రోడ్డు కొంత భాగం భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్నది. దెబ్బతిన్న ప్రాంతంలో ఇసుక బస్తాలు, గ్రావెల్‌ను పరిస్తే రాకపోకలకు అంతరాయం లేకుండా వుండేది. అయితే రోడ్లు భవనాలశాఖ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయారు.

7వ తేది మరింత వర్షం కురిసి వుంటే పూర్తిగా ఈ రోడ్డు తెగిపోయి వుండేది. ఇదే జరిగితే అల్లూరు, నెల్లూరుల మధ్య రాకపోకలు స్తంభించిపోయేవి. అలాగే దగదర్తి మండలం ఉలవపాళ్ల సమీపంలో రామన్న చెరువుకు గండిపడింది. ఈ గండిని కూడా సకాలంలో నీటిపారుదలశాఖ అధికారులు పూడ్చలేకపోయారు. దీంతో చెరువులోని నీరు క్రింద వున్న పొలాల్లోకి చేరింది. తీరప్రాంత మండలాల తహశీల్దార్‌లు కొందరు అప్రమత్తంగా వుండగా, మరి కొందరు తహశీల్దార్‌లు గ్రామాలకు వెళ్లిన దాఖలాల్లేవు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాల్సి వున్నప్పటికి ఎవరికి వారుగా వుండిపోయారు. విడవలూరు మండలంలోని రామతీర్థం సమీపంలో వున్న పొన్నపూడి పెద్ద పట్టపుపాళెంలో సముద్రపు అలలు కొంత భాగం ముందుకు వస్తున్నాయన్న సమాచారం అధికారులకు అందినప్పటికి తహశీల్దార్ గ్రామానికి వెళ్ల లేదు. దీంతో మత్స్యకారులు గ్రామం వదలి రామతీర్థం వైపు పరుగుతీయాల్సి వచ్చింది. జల్ తుఫాన్ తీరం దాటే వరకు ప్రభావిత మండలాల్లోని అన్ని శాఖల అధికారులు పరిస్థితులకు అనుకూలంగా చర్యలు తీసుకోవాల్సి వుండగా అధికారుల తీరు ప్రజలకు బాధ కలిగించింది. తుఫాన్ సమయంలో మండల కేంద్రంలో అధికారులు వుండాలని ఆదేశాలు వున్నా కొందరు తహశీల్దార్లు క్రిందిస్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించి తమ ఇళ్లకు చేరుకున్నారు.

16మంది మృతి

గత వారం రోజులుగా జిల్లాలో కురిసిన భారీ వర్షం, ఆదివారం జల్ తుఫాన్ కారణంగా జిల్లావ్యాప్తంగా 16 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో ఎక్కువమంది చలిగాలులు తట్టుకోలేక మరణించగా, మరో ఇద్దరు విద్యుత్ వైర్లు తెగిపడడంతో మరణించడం జరిగింది. మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే అవకాశం వుంది. ముత్తుకూరు, చిల్లకూరు, వాకాడు, కావలి మండలాల్లో మత్స్యకారులకు అపారనష్టం సంభవించింది. సైదాపురం, గూడూరుల మధ్య వాగులు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రత్యేక అధికారి సమీక్ష

గత మే నెలలో సంభవించిన లైలా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలలో పర్యటించి సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించిన అనంతరాముని జల్ తుఫాన్ సమయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా నియమించింది. ఆదివారం హైదరాబాద్ నుంచి విమానంలో తిరుపతికి చేరుకొని అక్కడ నుంచి నెల్లూరుకు విచ్చేశారాయన. నెల్లూరు చేరుకున్న ఆయన జిల్లా కలెక్టర్, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇతర అధికారులతో జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి జిల్లాలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం వుండడంతో అనంతరాముకు తుఫాన్ సహాయక చర్యల బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులతో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు, సలహాలు ఇవ్వడం తోపాటు అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. సముద్ర సమీపంలో వున్న మత్స్యకార ప్రాంతాల ప్రజలను అవసరం అయితే ఆర్టీసి బస్సుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు.

గతంలో సంభవించిన లైలా తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులకు నేటికీ పరిహారం అందలేదు. అలాగే వరి పంట వేసిన రైతులకు సైతం అపార నష్టం వాటిల్లింది. నష్టాలకు సంబంధించిన ప్రాథమిక అంచనాలను తయారుచేసిన అధికారులు ఆ తర్వాత పరిహారం గురించి మరిచిపోయారు. తాజాగా జల్ తుఫాన్ ప్రభావంతో మత్స్యకారుల వలలు, పడవలు, మరబోట్లు దెబ్బతిన్నాయి. వీటికి ఎప్పటికి పరిహారం అందిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. గత పదిరోజుల నుంచి జిల్లా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన జల్ తుఫాన్ ప్రభావం పెద్దగా లేకుండా పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు.



తుమ్మలపెంట సముద్ర తీర ప్రాంతంలో కావలి ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు.

జిల్లా రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190



నెల్లూరు ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్‌లో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించిన డెంటిస్ట్ డాక్టర్ డి.నారాయణరెడ్డిని సత్కరిస్తున్న సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి. ప్రక్కన రోటరీ క్లబ్ నిర్వాహకుడు సతీష్ తదితరులు.



దేశంలో కోళ్ల పరిశ్రమ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ బి.వి.రావు 75వ జన్మదినోత్సవం సందర్భంగా నెల్లూరులో నివాళులర్పిస్తున్న నెక్ మాజీ ఛైర్మన్ బలరామయ్యనాయుడు, కె.రాఘవరావు, ఎం.ఆర్.ప్రసాద్, ఎస్వీ రమణారెడ్డి తదితరులు.



నెల్లూరు మైపాడు గేట్ వద్ద మురళీకృష్ణ హోటల్ అధినేత గ్రోసు గోపాలయ్య నిర్వహించే వృద్ధుల ఆశ్రమానికి లక్ష రూపాయల సాయమందిస్తున్న మన్నెమాల అహల్యమ్మ.

నిధుల కోసం నిరీక్షణ

వేర్నబాధితులకు అందని సాయం

జిల్లాలో వర్షాలు పడినప్పుడల్లా రైతులకు పంటనష్టం జరగడం, అధికారులు నష్టాలపై నివేదిక పంపడం తప్ప నిధులు సకాలంలో అందిన దాఖలాలు లేవు. వీటి కోసం బాధితులు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదిక తయారు చేశారు. గ్రామీణ, ఆర్‌అండ్‌బి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల్లో నారుమళ్లు నీట మునిగాయి. కావలి, వాకాడు, చిట్టమూరు, కోట ప్రాంతాల్లో వరిపైరు దెబ్బతినింది. సంగం, బుచ్చి మండలాల్లో వందల పుట్ల ధాన్యం తడిసిపోయింది. అరటి, తమలపాకు తోటలు ధ్వంస మయ్యాయి. తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట, గూడూరు, కోవూరు, అల్లూరు, విడవలూరు, కొడవలూరులో రైతాంగం వర్షం కారణంగా తీవ్రంగా నష్టపోయింది. ఉద్యానవన రైతులు, కాయగూరలు సాగుచేసే రైతులు విలవిల్లాడారు. అల్లూరులో పైడేరు వుధృతికి మండలం అతలాకుతలమైంది. ఉలవపాళ్ల వద్ద రామన్న చెరువు తెగి గ్రామాలు నీట మునిగాయి. తల మంచి వద్ద రోడ్డు తెగి రాకపోకలు నిలిచిపోయాయి. ఇంతగా నష్టం జరిగినా అధికారులు నివేదిక పంపడం తప్ప పరిహారం అందజేయడంలో సాచివేత ధోరణి అవలంభిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

● ఓదార్పుతో

పెరిగిన సుధీర్‌రెడ్డి ప్రతిష్ట!

జిల్లాలో వైఎస్ జగన్ చేపట్టిన ఓదార్పుయాత్ర ఎలావున్నా విజయ డైరీ ఛైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి మాత్రం పరపతి పెంచుకొన్నాడు. తోటపల్లిగూడూరు మండలంలో జగన్‌కు అండగా నిలబడి తన సత్తా చాటాడు. ఈ విషయంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా లెక్కచేయక జగన్ పర్యటన విజయవంతం చేయడంలో తన వంతు పాత్ర పోషించాడు. నరుకూరు సెంటర్‌లో వైఎస్ విగ్రహాన్ని ప్రతిష్టింపజేయడమే కాక పోట్ల

తోటపల్లిగూడూరులో అన్నీ తానై చూసుకున్నాడు

పూడిలో జగన్ బస చేసేలా చేసి తన చతురత చూపాడు. గతంలో సివి.శేషారెడ్డి ఎమ్మెల్యేగా వున్నప్పుడు సర్వేపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరించాడు. డైరీ ఛైర్మన్ పీఠం కోసం ఎన్నో ఏళ్ల శ్రమించి ఆ పదవి దక్కించుకొన్న సుధీర్‌రెడ్డి జగన్ పర్యటనను మండలంలో తన భుజస్కందాలపై వేసుకొన్నాడు. ఆయనకు టంగుటూరు శ్రీనివాసులరెడ్డి, నాయుడు హేమంత్ కుమార్‌రెడ్డి సహకరించడంతో ఓదార్పు విజయవంతమైందనాలి.

కావలి పోలీసుల నిలువు దోపిడీ!

హైవేపై జులుం

రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు కావలి పోలీసులు. బోగోలు తదితర ప్రాంతాల నుంచి రైతులు పంపు సెట్ల కోసం డీజిల్‌ను కావలి నుంచి రాత్రి సమయాలలో తమ పనులు పూర్తి చేసుకొన్న తర్వాత తెచ్చుకొంటుంటారు. నైట్‌బీటు కానిస్టేబుళ్లు, హోంగార్డులకు అర్ధరాత్రి వేళలో వాహనాలపై తిరిగేవారు కన్పడితే చాలు రకరకాలుగా బెదిరించి డబ్బులు గుంజేస్తున్నారట. ఇటీవల బోగోలు మండలం విశ్వనాధరావు పేటకు చెందిన ఒక వ్యక్తి తన అవసరాల నిమిత్తం 35 లీటర్ల డీజిల్, కిరోసిన్‌ను కావలిలో కొనుగోలు చేసి బిట్రగుంటకు ఆటోలో వస్తుండగా గౌరవరం డాబా దగ్గర కానిస్టేబుల్, హోంగార్డు అతన్ని నిలిపి కాగితాలు చూపించమంటూ బెదిరించారు. ఎంత చెప్తున్నా వినకుండా మద్యం మత్తులో వున్న పోలీసులు అతని వద్ద నుంచి 8వేల రూపాయలు గుంజుకున్నారట. అంతే కాకుండా ఈ విషయం బయటకు చెప్తే తిరగలేవు అంటూ హెచ్చరించడంతో పాపం ఆ వ్యక్తి పోలీసులు నిలువు దోపిడీ చేసినా కిక్కురు మనకుండా వుండిపోయాడు. ఈ విషయం ఆనోట ఈనోటా తెలియడంతో రాత్రివేళల్లో తిరగాలంటేనే పోలీసులను చూసి ప్రజలు భయపడుతున్నారు. ఇలాంటి ఘటనలు అధికమవుతున్నా ఎవ్వరూ ఫిర్యాదు చేయడానికి ముందుకు రాకపోవడంతో పోలీసులు బెదిరించి డబ్బులు గుంజేసుకొంటున్నారు.

కుడితిపల్లి భూములపై అక్రమార్కుల కన్ను!

మనుబోలు మండలంలోని కుడితిపల్లిలో గల ప్రభుత్వ ఆధీనంలోని భూమిని ఆక్రమించుకొనే యత్నాలు ముమ్మరమైనాయి. ఈ ప్రాంతంలో 100 ఎకరాల సోత్రియ భూమి ప్రభుత్వ పరిధిలో వుంది. చుట్టుప్రక్కల పరిశ్రమలు ఏర్పాటవుతుండడం, భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పలువురి కన్ను ఈ భూములపై పడింది. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ భూము

రెవిన్యూ అధికారుల సహకారం

లను స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా కొంత భూమిని చదును చేసేందుకు పూనుకోవడంతో కుడితిపల్లి గ్రామస్తులు అడ్డు తగిలారు. తాత్కాలికంగా వారు భూములను చదును చేసే పని నుంచి వైదొలగినా తిరిగి ఆక్రమించుకొనే అవకాశం వున్నందున జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఈ ప్రయత్నాన్ని అడ్డుకొని భూములను కాపాడాలని స్థానికులు కోరుకొంటున్నారు.

నిరుపయోగంగా చేనేత భవనం

వెంకటగిరిలో చేనేత వర్గాల కోసం నిర్మించిన చేనేత భవనం దశాబ్ద కాలంగా నిరుపయోగంగా వుంది. 1998లో ఎమ్పీ చింతా మోహన్ తన నిధులు ఆరు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఈ చేనేత భవనాన్ని నిర్మించారు. చేనేత కేంద్రమైన వెంకటగిరిలో ఆ వర్గాల ప్రజలకు కమ్యూనిటి హాలుగా, శిక్షణా కేంద్రంగా ఉపయోగపడుతుందని నిర్మించిన ఈ భవనం నిరుపయోగంగా మారింది. కొంతకాలం హ్యాండ్‌లూమ్ శిక్షణాకేంద్రం జరిగినా తర్వాత ఈ భవనాన్ని దేనికీ వినియోగించకపోవడంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఉద్దేశం మాత్రం నెరవేరలేదు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ వహించి చేనేతలకు ఈ భవనం ఉపయోగపడేలా చర్యలు చేపట్టాల్సి వుంది.

● తడిచి ముద్దయిన

తీరప్రాంత మండలాలు!

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కావలి నియోజక వర్గంలో పలు మండలాల్లో జనజీవనం అతలాకుతలమయ్యింది. అల్లూరు మండలంలోని 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సున్నపుబట్టీ నుంచి దగదర్తి వరకు వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయింది. ఎస్సీ కాలనీలో నీరు వచ్చిచేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కావలి పట్టణంలో ఇస్లాంపేట, బాలకృష్ణారెడ్డినగర్, జనార్ధన్‌రెడ్డి కాలని, తుఫాన్‌నగర్, బోగోలు పంచాయితిలోని కుమ్మరివీధి, హరిజనపాళెం, బేతానిపేటల్లో నడుములోతు నీళ్లు ఇళ్లలోకి రావడంతో జనజీవనం అస్తవ్యస్తమయ్యింది. ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు వర్షం వలన దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. గండిపడిన చెరువులకు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు.



బోగోలు బేతానిపేటలో ఇళ్లలోకి నీరు.



సమాచార హక్కు కమిషనర్ దిలీప్‌రెడ్డిని నెల్లూరు టౌన్‌హాల్‌లో సన్మానిస్తున్న సమాచార హక్కు సాధన సమితి సభ్యులు.

కళాకారుల భూమి కబ్జాకు యత్నం!

భట్రకాగొల్లులో భూభాగోతం

స్వదల కోసం ప్రభుత్వం అందజేసిన భూములు కబ్జాకు గురౌతున్న వైనం అల్లూరు మండలం భట్రకాగొల్లులో చోటు చేసుకొంటున్నది. ఈ ప్రాంతంలోని కొత్తూరు వద్ద 58.12 ఎకరాలను 1992లో అక్షరాస్యత ఉద్యమంలో పాలుపంచుకొన్నందుకు 77మంది కళాకారులకు వారి సేవలను గుర్తించి ఈ భూమిని పంపిణీ చేశారు. పట్టా ఇచ్చిన అధికారులు లబ్దిదారులకు భూముల హద్దులు చూపక పోవడంతో ఆనాటి నుంచి భూములు సాగు చేసుకొనే వీలు లేక బీడుగా మారాయి. లబ్దిదారులు పలుమార్లు భూముల హద్దులు చూపించమని అధికార్ల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ భూములపై కన్నెసిన కొందరు కబ్జాదారులు వీటిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుండగా మరి కొందరు ఈ భూముల్లో నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించుకపోతున్నారు. గ్రావెల్ త్రవ్వకాలతో భూముల్లో గుంటలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరచి తమకు ప్రభుత్వం కేటాయించిన భూములకు హద్దులు చూపించాలని, కబ్జాకు గురి కాకుండా కాపాడాలని లబ్దిదారులు కోరుకొంటున్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల!

ముత్తుకూరులో ఏర్పాటు చేసిన పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకొనింది. ఎంపిడిఓ కార్యాలయానికి, గ్రామ పంచాయితీ కార్యాలయానికి మధ్య వుండే ఈ వైద్యశాల కూలిపోయేందుకు సిద్ధంగా వుంది. పైన శ్లాబ్ ఊడిపడుతుండ దంతో సిబ్బంది హడలిపోతున్నారు. కృష్ణపట్నం, పంటపాళెం, బ్రహ్మదేవి తదితర ప్రాంతాలలోని రైతులు పశువులను ఈ వైద్యశాలకు తీసుకొని వస్తుంటారు. ఇక్కడ పరిస్థితి దారుణంగా వుండడంతో పశువులను ఈ వైద్యశాలకు తీసుకొని రావడం తగ్గిపోయింది. మండలానికి ప్రధానమైన ఈ పశువైద్యశాలకు మరమ్మత్తులు చేయించాలని, తగిన వైద్య సదుపాయాలు కల్పించాలని రైతులు కోరుకొంటున్నారు.



జొన్నవాడలో జోరుగా పేకాట!

బుచ్చి పోలీసు నిద్రపోతుందా?

జొన్నవాడ పుణ్యక్షేత్రంలో పేకాట జోరుగా సాగుతోంది. చుట్టు ప్రక్కల ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకుల అనుచరులు ఈ పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తుండడంతో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. జొన్నవాడ రేవు వద్ద గల దిబ్బ మీద జూదం పగలు, రాత్రి అనే తేడా లేకుండా జరుగుతుండడంతో ఎక్కడెక్కడి నుంచో బైక్‌లు, కార్లు వేసుకొని వచ్చి పేకాట ఆడుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలోనే పేకాట నిర్వహించిన వారు ఇక్కడ స్థావరం ఏర్పాటుచేసినట్లు సమాచారం. లక్షలాది రూపాయలు పందెంగా కట్టి పేకాట ఆడుతున్నా ఈ సంగతి బహిరంగమైనా స్థానిక పోలీసులు మాత్రం పేకాట స్థావరాలపై కన్నెత్తి చూడడం లేదు. వారికి మామూళ్లు అందుతుండడమే దానికి కారణమని ఆరోపణలు వినవస్తున్నాయి. పేకాటతోపాటు మద్యం సేవించి అల్లరికి దిగుతుండడంతో ఇక్కడకు వచ్చే భక్తులు ఆందోళన చెందుతున్నారు.


ముత్తుకూరు పిహెచ్‌సికి జబ్బు చేసింది!

పేరుకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ముత్తుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. పేరుకు ఆరోగ్య కేంద్రమైనా రోగులకు సరైన చికిత్స అందడం లేదు. రోగ నిర్ధారణ పరీక్షలు చేయాల్సిన ల్యాబొరేటరీ మూత పడింది. వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్ టెక్నిషియన్ పోస్టు ఖాళీయై చాలాకాలం అయినా భర్తీ కాకపోవడంతో రక్త, మూత్ర తదితర పరీక్షలకు ప్రైవేట్ ల్యాబొరేటరీలను ఆశ్రయించాల్సి వస్తుండడంతో పేద ప్రజలపై అదనపు భారం పడుతోంది. అధిక ఫీజులు వసూలు చేస్తుండడంతో రెక్కాడితే గాని డొక్కాడని పేదలు రోగనిర్ధారణ పరీక్షలు చేయించుకోలేక అల్లాడిపోతున్నారు. లక్షల రూపాయల విలువ చేసే పరికరాలు వున్నప్పటికీ అవి నిష్ప్రయోజనం అవుతుండడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటుచేసిన ఉద్దేశ్యం నెరవేకుండాపోతున్నది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి ముత్తుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ల్యాబొరేటరీని వినియోగంలోనికి తీసుకరావాలని మండల ప్రజలు కోరుకొంటున్నారు.



ఉపయోగపడని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.




రోశయ్య వేడికోలు



రాష్ట్ర పరిపాలన అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో రోశయ్య సచివాలయంలోని కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం జరిపాడు. కార్యదర్శుల క్రమశిక్షణా రాహిత్యంపై రోశయ్య అగ్గిమీద గుగ్గిలంలా మారతాడని సచివాలయ వర్గాలు ఊహించాయి. అయితే సదరు అంచనాల్ని తారుమారు చేస్తూ రోశయ్య కార్యదర్శుల కాళ్లా వేళ్లా బడుతున్నట్లు వ్యవహరించాడు. బాబ్బాబు... మీకు పుణ్యం ఉంటుంది... సమయానికి కార్యాలయాలకు రండి! ఫైళ్లను సకాలంలో పరిష్కరించండి. అసెంబ్లీకి తొందరగా సమాధానాలు పంపండి... అన్న రీతిలో రోశయ్య ప్రసంగం కొనసాగేసరికి కార్యదర్శులంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇదంతా గమనించిన ఓ ముఖ్యకార్యదర్శి ఇంతోటిదానికి సమావేశం అవసరమా? అంటూ నసిగాడట.

కోర్టుకెక్కనున్న లక్ష్మిపార్వతి




తనను ఐరన్‌లెగ్ అన్నందుకు లక్ష్మీపార్వతి మాజీమంత్రి చంద్ర మోహన్‌రెడ్డిపై కోర్టుకు వెళ్తారట. నెల్లూరులో జరిగిన జగన్ సభకు హాజరైన సందర్భంగా లక్ష్మీపార్వతిని మాజీ మంత్రి నానా మాటలన్నాడు. ఎన్టీఆర్ చావుకు లక్ష్మీపార్వతే కారణమని, ఆమె వచ్చాకనే ఎన్టీఆర్ భ్రష్ట పట్టాడంటూ పలురకాల వ్యాఖ్యలు చేశాడు. అయితే తను కూడా ఏం తక్కువ తినలేదన్నట్లు లక్ష్మీపార్వతి కూడా అదేస్థాయిలో చంద్రమోహన్‌పై దుమ్మెత్తి పోసింది. తన ప్రభ వెలుగుతున్న రోజుల్లో చంద్రమోహన్ కూడా తన కాళ్లు పట్టుకున్నాడని, నెల్లూరుకు వచ్చినపుడు తన ఇంటో ప్రత్యేక గది ఏర్పాటుచేసి మరీ ఆతిథ్యమిచ్చాడంటూ లక్ష్మీపార్వతి చీవాట్లు పెట్టింది. ఏది ఏమైనా ఒక మహిళ అని కూడా చూడకుండా తనపై నిరాధార ఆరోపణలు చేసిన చంద్రమోహన్‌పై కోర్టు కెళ్లాలని లక్ష్మీపార్వతి సన్నాహాలు చేస్తోందట.

రేఛల్ పోస్టుకు బాహాబాహీ



వ్యవసాయ ఆహారశాఖ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న రేఛల్ చటర్జీ పోస్టు కోసం సచివాలయంలో బాహాబాహి పోటీ జరుగుతోంది. మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఎఆర్ సుకుమార్, రెవెన్యూ కార్యదర్శి పునీత ఈ పోస్టు కోసం రేసులో వున్నారు. రేఛల్ ఛటర్జీ డిసెంబర్ నెలలో పదవీ విరమణ చేయనున్న సందర్భంగా ఈ పోస్టు ఖాళీ అవుతోంది. సుకుమార్ సిఎం సామాజిక వర్గీయుడు కావడం, సిఎంతో వున్న సంబంధాల కారణంగా ఆ పోస్టు తనకే దక్కుతుందంటున్నాడు. కాగా రెవెన్యూ కార్యదర్శిగా భూకేటాయింపుల్లో వస్తున్న వత్తిడి నుంచి బయటపడటానికి పునీత అక్కడి నుంచి బదలీని కోరుకుంటున్నాడు. ఈ ఇద్దరు ఐఎఎస్‌ల మధ్య జరుగుతున్న పోస్టింగ్ పైరవీపై ఐఎఎస్ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. చూద్దాం... ఎవరి బలమెంతో తొందర్లోనే తేలుతుంది కదా!

మంత్రులకు డిసెంబర్ భూతం



మంత్రులందరికీ డిసెంబర్ నెల భూతం పట్టుకుంది. డిసెంబర్‌లో శ్రీకృష్ణ కమిటీ తెలంగాణపై నివేదిక యిచ్చాక ఏం జరుగుతుందన్న దానిపై మంత్రుల్లో చర్చ మొదలైంది. డిసెంబర్ దాటాక ఈ ప్రభుత్వం ఉంటుందా? రాష్ట్రపతి పాలన వస్తుందా? ఒకవేళ రాష్ట్రపతి పాలన వస్తే మన సంగతేమిటి? అంటూ మంత్రులు చెవులుకొరుక్కోవడం ఎక్కువైంది. రోశయ్య కూడా డిసెంబర్ నెలపై రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నాడట. దీంతో తమ పదవులకు గండం తప్పదేమోనంటూ మంత్రులు దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే కార్యక్రమంలో పడ్డారు. పెండింగ్ ఫైళ్లు దుమ్ము దులిపి చకచకా పరుగులు తీయిస్తున్నారట. అన్నట్లు అన్ని ఫైళ్లు కాదులెండి! అవసరమైన ఫైళ్లే సుమా!

ఖరీదైన కరచాలనం



మనకెవరైనా ఎదురైతే హలో బాగున్నారా! అంటూ కరచాలనం చేస్తాం. అయితే సాక్షాత్తు అమెరికా అధ్యక్షుడు ఒబామా వంటి దిగ్గజంతో కరచాలనం చేయడం అంటే మాటలా? గుంటూరు ఎమ్పీ రాయపాటి సాంబశివరావుకు ఈ విషయం బాగా అనుభవంలోకి వచ్చింది. పార్లమెంటులో ప్రసంగం తర్వాత ఒబామా ఎమ్పీలనందరినీ సాదరంగా పలకరించారు. రాయపాటి దగ్గరకు వస్తుండగా ఏమనుకున్నాడో ఏమోగానీ తన మెడలో వున్న బంగారు దండ తీసి ఒబామా చేతిలో పెట్టి మరీ కరచాలనం చేశాడు. ఏం చేయాలో తోచని ఒబామా దాన్ని తన సెక్యూరిటీ సిబ్బంది చేతికిచ్చాడు. ఇంతకూ ఆ దండ ఖరీదు నాలుగు లక్షల రూపాయలట. ఒబామా గుర్తింపు కోసం తంటాలు పడిన ఎమ్పీగారికి ఈ రకంగా నాలుగు లక్షల రూపాయల చమురు వదిలింది.

స్మృత్యంజలి



జననం : 1931 మరణం : 2006

కీ॥శే॥ **వల్లూరు నాగభూషణం** గారు

రిటైర్డు తహశీల్దారు

మరియు P.A to Sri Magunta Subbarama Reddy, Ex. M.P. Ongole.
P.A to Sri Magunta Srinivasula Reddy, M.P. Ongole.
P.A to Smt. Magunta Parvathamma, Ex. M.L.A. Kavali.

నిరంతరం శ్రమకోర్చి మా అందరినీ ఉన్నత శిఖరాలకు చేర్చిన
మీ ప్రేమానురాగాలను మా హృదయాంతరాళాలలో పదిలపరుచుకుంటాము.

ఇట్లు
భార్య : శ్రీమతి వల్లూరు మధుసూదనమ్మ

కుమారులు - కోడళ్లు
వల్లూరు దుర్గాప్రసాద్ - మాధవి
A.E. IVRCL. Hyderabad.
వల్లూరు మనోహర్ - కృష్ణవేణి
DEC. Water Base Ltd., Nellore.

అల్లుళ్లు - కుమార్తెలు
శ్రీ నిడిగంటి మల్లికార్జునరావు - కనకదుర్గ
Retd. Suptd.TTD.
శ్రీ నిడిగంటి గోవర్ధనరావు - శశికళ
శ్రీ AM. దామోదరం - లలిత
BSNL, Nellore.

మరియు
మనుమలు - మనుమరాళ్లు


భక్తుని విశ్వాసాన్ని పరీక్షించిన భగవంతుడు!

బక్రీదు పండుగ పరమార్థమిదే.

త్యాగమన అనే తేడా లేకుండా అల్లా ఆదేశాన్ని పాటించాలన్న సందేశాన్ని చాటి చెప్పే పండుగ బక్రీద్. ప్రపంచ వ్యాప్తంగా వున్న ముస్లింలు దేవదూతగా తలచే ఇబ్రహీం త్యాగనిరతిని, కీర్తి ప్రతిష్టలను ప్రజలకు తెలియపరచే విధంగా జరుపుకొనే శుభదినమే బక్రీద్. ఈ పండుగకు "ఈదుల్ జుహా" అని పేరు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల అయిన జిల్‌హేజ్ 10వ రోజు బక్రీద్ పండుగను జరుపుకొంటారు.

అరబ్ దేశాల్లో దుర్మార్గాలు పెచ్చురిల్లుతున్న సమయంలో తన దూత ద్వారా మానవజాతిని సన్మార్గంలో నడిపించాలని తలపోస్తాడు దైవం. ఈ సందర్భంగా అల్లా ఇచ్చే ఆదేశంతో తన జీవితాన్ని త్యజించిన మహనీయుడు ఇబ్రహీం. 500ఏళ్ల క్రిందట ఈ మహనీయుడు ఇరాక్‌లో జన్మించాడు. ఆ కాలంలో దేశాన్ని పాలిస్తున్న నమ్రూద్ అనే రాజు నిరంకుశంగా వ్యవహరిస్తుండడంతో దేశంలో అశాంతి నెలకొనింది. ప్రజలు మూఢాచారాల్లో కూరుకపోయి వుండేవాళ్లు. దీన్ని చూసి కలత చెందిన ఇబ్రహీం నిజమైన దైవం ఎవరు? అనే సత్యాన్వేషణ ప్రారంభించాడు. నేను అస్తమించే నాటికి ఎవరిని పూజించను, వాటికి తలవంచను, విశ్వమంతటిని సృష్టించిన ఆ సర్వేశ్వరుడిని మాత్రమే ప్రార్థిస్తానంటాడు. ఆనాటి నుండి ఇబ్రహీంకు దైవజ్ఞాన భాగ్యం కల్గి, ఆ జ్ఞానకాంతులు ఏకైక దైవధర్మ వైతాళికునిగా, దేవ ప్రవక్తగా మార్చాయి.


శాంతి సందేశాన్ని ప్రచారం చేస్తూ స్వదేశాన్ని వదలి దేశదిమ్మరిలా ఆయన తిరుగుతుంటాడు. ఇద్దరు భార్యలున్నప్పటికీ పిల్లలు కలుగకపోవడంతో మానసికంగా కుంగిపోయిన హజ్రత్ ఇబ్రహీం తాను నమ్మిన దేవుని వద్ద చేతులు చాచి ప్రార్థించాడు. ఆ ప్రార్థనను ఆలకించిన అల్లా ఇబ్రహీంకు పండంటి మగ బిడ్డను ఆయన రెండవ భార్యకు ప్రసాదిస్తాడు. ఆ తర్వాత కూడా ఆయనలో దైవచింతన ఏమాత్రం తగ్గలేదు. కొన్ని కారణాల వల్ల ఆయన భార్యాబిడ్డలను ఎడారిలో విడిచిపెట్టిన సందర్భంలో మంచినీళ్ల కోసం పసివాడు కాలిమడమలతో భూమిని రాసిన చోట బ్రహ్మాండమైన నీటి ఊట వెలసింది. ఆ పవిత్ర నీటినే నేటికి 'జంజం'కా పానీ అనే పేరుతో ముస్లింలు తీర్థజలంగా సేవిస్తున్నారు. ఈ ప్రదేశమే మక్కా నగరంగా పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది.



ఇబ్రహీం నిద్రిస్తున్న సమయంలో కలలో అల్లా కనిపించి కుమారుడిని బలి ఇవ్వమంటాడు. నిద్ర నుంచి మేల్కొన్న ఆయన కొడుకైన ఇస్మాయిల్‌కు ఇది వివరించి బలికి సిద్ధంగా వుండమంటాడు. ఇస్మాయిల్ తలను 'జుబా' ఇవ్వాలనుకొన్న సమయంలో వారి త్యాగనిరతికి సంతోషించిన అల్లా కొడుకు స్థానంలో గొర్రెను పెడతాడు. ఆనాడు ఇబ్రహీం దేవునికి ఆజ్ఞను తీర్చేందుకు కుమారుని సైతం బలిని ఇవ్వడానికి సిద్ధపడినందుకు గుర్తుగా బక్రీద్ పండుగ జరుపుకొంటారు. ఖుర్బానీ పేరుతో పొట్టేళ్లను కోసి మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగాన్ని పేదలకు, మరొక భాగాన్ని బంధువులకు ఇంకొక భాగాన్ని తమ కోసం ఉంచుకొంటారు. ఈ నెలలోనే ముస్లింలు భక్తిప్రపత్తులతో హజ్ యాత్రకు వెళతారు. మక్కా నగరానికి చేరుకొని కాబా చుట్టూ 7 ప్రదక్షణలు చేసి మసీదులో ప్రార్థనలు చేసి తమ జన్మ చరితార్థం చేసుకొంటారు.

ట్రంకురోడ్డు టాక్

తృప్తి మిగల్చని పండగ!



దీపావళి పండుగను కుటుంబసమేతంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకొంటారు. మాంసాహార ప్రియులైతే నరక చతుర్దశి రోజు మందు, ముక్క తప్పనిసరిగా ముడతారు. ఈసారి నరక చతుర్దశి గురువారం రావడంతో పలువురు ఇళ్లలో నాన్‌వెజ్ వండలేదు. శుక్రవారం దీపావళి కావడంతో వెజిటేరియన్ వంటలతో సరిపెట్టారు. శని వారమైనా ముక్క తిందామనుకొన్న వారికి మధ్యాహ్నం వరకు అమావాస్య వుండడంతో నోములు నోచుకొన్న మహిళలు ఇళ్లలో నీసు వండను ససేమిరా అనడంతో మొత్తానికి ఈ యేడాది దీపావళి భోజన ప్రియులకు తృప్తి మిగల్చని పండగగా మిగిలింది.

తనిఖీల 'చింతా'!




నెల్లూరీయుడు గత ఐదారుసార్లుగా తిరుపతి ఎమ్పీగా గెలుస్తున్న చింతామోహన్ జిల్లాలో వరుసగా చేస్తున్న తనిఖీలు చర్చనీయాంశమయ్యాయి. మామూలుగా చింతామోహన్ ఎమ్పీగా గెలిచాక మళ్లీ ఎన్నికల వరకు తిరిగి కనపడేవాడు కాడు. అటువంటిది అక్టోబర్ నెలలో ఐటిడిఏ, ఎస్సీ కార్పొరేషన్, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీచేసి అధికారులకు ఏవిధంగా పనిచేయాలో నిర్దేశనం చేశాడు. నవంబరు నెల మొదటి వారంలో వ్యవసాయశాఖ జాయింట్ డైరక్టర్ కార్యాలయంతోపాటు ఇఫ్కో రాచర్లపాడులో నిర్మింప తలపెట్టిన కిసాన్‌సెజ్‌ను తనిఖీ చేశారాయన. అన్ని శాఖలు, వాటి లోటుపాట్లపై సమగ్ర అవగాహన వున్న 'చింతా' చేస్తున్న తనిఖీలు మొత్తానికి అన్ని శాఖల అధికారులను హడలెత్తిస్తున్నాయి.

నెల్లూరును ముంచెత్తిన ఫ్లెక్సీలు




జల్ తుఫాను ఒకవైపు... వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర మరోవైపు నెల్లూరీయులను గత్తర పెట్టాయి. తుఫాన్ తీరం దాటుతుందని ప్రకటించిన 7వ తేదీనే నెల్లూరులో జగన్ ఓదార్పు యాత్ర ముగింపు సభను ఏర్పాటు చేశారు. ఈ సభను వైఎస్ విగ్రహావిష్కరణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజీవ్‌భవన్ వర్గాలు జగన్‌కు స్వాగతం చెబుతూ పదుల సంఖ్యలో బెలూన్లు, కటౌట్లు, వందల సంఖ్యలో ఫ్లెక్సీలతో నగరాన్ని ముంచెత్తారు. గాంధీబొమ్మ వద్ద 108 అడుగుల కటౌట్, నర్తకి థియేటర్ యజమాని మనోహర్‌రెడ్డి హాలు కనపడకుండా ఏర్పాటుచేసిన వైఎస్, జగన్మోహన్‌రెడ్డిల ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నెల్లూరులో 'జల్' తుఫాను జలదరింపుకన్నా ముందు జగన్ యాత్ర చేసిన హడావుడే ఎక్కువనిపించింది.

దెబ్బతిన్న టపాకాయల వ్యాపారులు



టపాకాయల వ్యాపారమంటే రూపాయి పెట్టుబడికి పది రూపాయల ఆదాయం వచ్చే వ్యాపారంగా ప్రతీతి. శివకాశిలో ఐదు రూపాయలకు కొన్న కాకరఒత్తులు పెట్టెను సింహపురిలో 50 రూపాయలుగా అమ్మేవాళ్లు. 'జల్' తుఫాను మూలంగా పడిన వర్షాలకు టపాకాయ వ్యాపారం జోరుగా సాగలేదు. దీనికితోడు అధికారులు నగరంలో టపాకాయల అంగళ్లన్నీ విఆర్‌కాలేజి, వైఎంసిఎ గ్రౌండ్‌లలోనే పెట్టించడంతో మారిన వాతావరణంలో సరకును అమ్ముకోను నానాపాట్లు పడ్డారు. లాభాలు లేకపోయినా నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో వ్యాపారస్తులు తెగబడడంతో దీపావళి పండుగ రోజు టపాకాయలు మధ్యస్తపు రేట్లకే దొరికాయి. సామాన్య మధ్య తరగతీయులు ఒకటో రెండు టపాకాయలు, కొన్ని మతాబులు కాల్చి దీపావళి చేసుకొన్నామన్న తృప్తిని పొందారు.

ఓదార్పుతో జ్వరం!




నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి బహు సున్నితుడు. పేరుకు కాంట్రాక్టరేగానీ మల్లెపూవులాంటి తెల్లని దుస్తులు తొడిగి ఇస్త్రీ మడత కూడా నలగనంతగా ఎవర్ ఫ్రెష్‌గా కనిపిస్తాడాయన. అటువంటి వ్యక్తి కాస్త నెల్లూరు జిల్లాలో జగన్ ఓదార్పు యాత్ర భారం మోయనుమందు కొచ్చారు. మూడు వారాలపాటు శారీరకంగా, మానసికంగా నలిగి పోయారు. తలకు రంగువేయక, దుస్తులు నలిగి తిరిగిన ఆయనకు చివరకు జ్వరం కూడా వచ్చింది. దీంతో జిల్లాలో జగన్ ఓదార్పుయాత్ర చివరి మూడు రోజులు ఆయన పాల్గొనలేక విశ్రాంతి తీసుకున్నారు. ఆయన బదలు సోదరుడు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరులో జరిగిన ఓదార్పు ముగింపు సభకు మాత్రం రాజమోహన్‌రెడ్డి తప్పదన్నట్లు హాజరయ్యారు. ఏదైతేనేం జగన్ ఓదార్పు యాత్రలో కష్టమంతా మేకపాటి సోదరులదనేది ట్రంకురోడ్డు టాక్!



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

విందు వినోదాలలో ముఖ్యపాత్ర వహిస్తారు. చాలాకాలంగా ప్రయత్నిస్తూ వచ్చిన పనులు ఈనాడు ఫలోన్ముఖమవుతాయి. పుర ప్రముఖుల పరిచయం ఆనందాన్నిస్తుంది. మనశ్చాంచల్యం. విశ్రాంతి తక్కువ. జాయింటు వ్యవహారాలు చక్క దిద్దుకొంటాయి. ఆకస్మిక సంఘటనలకు అవకాశాలున్నాయి. వృత్తి ఉద్యోగాల్లో కోరుకొన్న మార్పులు చేర్పులు జరిగే సూచనలు.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

శుభపరంపరలనందుకునే కాలం. వినోదాలతో కాలక్షేపం చేస్తారు. సంతాన మూలకంగా ఖర్చులు. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. తోటివారితో అభిప్రాయభేదాలు తొలగుతాయి. అప్పులు తీరుస్తారు. విరోధాలు పాటించేవారిపై మీదే పై చేయి. భగవదారాధన వైపు మనసు పోనిస్తారు. పురోభివృద్ధికి సహాయసహకారాలందించే వారితో మైత్రి ఏర్పడుతుంది.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

ఇంటిలో ఆనందదాయకమైన పరిస్థితులు చోటు చేసుకొంటాయి. ఆర్థికవృద్ధికి, పొదుపుకు సంబంధించి చేసే పనులు ఫలవంతమవుతాయి. వృత్తి, వ్యాపారరీత్యా కొత్త ఒప్పందాలు చేసుకొంటారు. ప్రభుత్వం నుండి ఆదాయావకాశాలు. శుభ వార్తాశ్రవణం. ఆరోగ్య విషయాలు అనుకూలం. శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. గొప్పవారి వద్ద మీ సామర్థ్యాన్ని ప్రకటించి సన్మానింపబడతారు.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

నిరీక్షణ చేస్తూ ఉండిన వ్యక్తుల్ని కలుసుకొంటారు. దైవారాధన, పుణ్యక్షేత్రాటన వైపు మనసు పోనిస్తారు. చేతిలో చిల్లిగవ్వ నిలవదు. వచ్చినది వచ్చినట్లుగానే ఖర్చవుతుంది. ఆర్థికసమస్యలున్నా మనోధైర్యం కోల్పోరు. శుభకార్యాలకై ఖర్చులు చేస్తారు. ఇరుగుపొరుగువారిని అనుసరించి పోవడం మంచిది. విజయవంతంగా పనులు సాగుతాయి. అధికారుల నుండి కొంత ఆదరణ.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ప్రియ వార్తాశ్రవణం. కుటుంబంలో మీ పలుకుబడి పెరుగుతుంది. నూతన వస్త్రాదులు ధరించి ఎంతో సంతోషంగా కానవస్తారు. ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి. ధనసంపదలు, ఆస్తి పెంపుదల సూచన. జీవశక్తి చక్కగా ఉంటుంది. ఇల్లుమార్పిడి, స్థలమార్పిదుల గురించి చింతిస్తారు. ఇంటికి సంబంధించి దుబారా ఖర్చు చేస్తారు. దూరప్రయాణావకాశాలు కానవస్తున్నాయి.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

మిత్రులతో సమాగమం తద్వారా అనుకొన్నవి సాధిస్తారు. ధనాదాయం తృప్తికరంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాల్లో కోరుకొన్న మార్పులు చేర్పులు జరిగే సూచనలు. బంధువుల మూలంగా చిరు ఖర్చులు. ఆరోగ్యం చక్కగా ఉంటుంది. ప్రభుత్వం ద్వారా ఆదాయాలు. ఆహారవిషయంలో శ్రద్ధలేకుంటే అనారోగ్యపరిస్థితులు ఆందోళన నిస్తాయి. ఎదురుచూచిన వారిని కలుసుకొంటారు.

వారఫలాలు

తేది 13-11-2010 నుండి 19-11-2010 వరకు తుల, వృశ్చికాల్లో రవి; తులలో శుక్రుడు; కన్యలో శని; కుంభంలో గురువు; వృశ్చికంలో బుధ, కుజులు; ధనుస్సులో రాహువు; మిథునంలో కేతువు; మకర, కుంభ, మీన, మేషాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

14తేది నెహ్రూ జయంతి.
16తేది వృశ్చిక సంక్రమణం.
17తేది ఉత్తాన ఏకాదశి, బక్రీదు.
18తేది చిలుకు ద్వాదశి.

శుభ ముహూర్తాలు


17, 19తేదీల్లో ప.11.00 నుండి 12.00 గంటల వరకు మకరలగ్నాన
18తేదీ రా.9.30 నుండి 11.00 గంటల వరకు కర్కాటకలగ్నాన
17, 18తేదీల్లో తె.5.00 నుండి 6.00 గంటల వరకు తులాలగ్నాన శుభ ముహూర్తాలున్నాయి.

నవంబర్ తిథులు

కార్తీక శుద్ధ

13	శని	సప్తమి	ఉ.8.57	గం.ల.వ
14	ఆది	అష్టమి	ఉ.11.17	గం.ల.వ
15	సోమ	నవమి	మ.1.49	గం.ల.వ
16	మంగళ	దశమి	సా.4.19	గం.ల.వ
17	బుధ	ఏకాదశి	సా.6.32	గం.ల.వ
18	గురు	ద్వాదశి	రా.8.23	గం.ల.వ
19	శుక్ర	త్రయోదశి	రా.944	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

ముక్కుసూటిగా పోవడం, అసహనం, కోపావేశాలు మానుకోవాలి. ప్రతి పనిలో నిదానం అవసరం. అప్పుడే మనశ్శాంతి లభిస్తుంది. ఆంత్ర బాధలుండవచ్చు. ధనవిషయంలో లోపం ఉండదు. ప్రేమికులకు కొత్త అనుభూతులు చోటుచేసుకొంటాయి. వృత్తిపరులు మూర్ఖతవల్ల నష్టపోయే అవకాశాలున్నాయి. వ్యాపారులకు ఇతరులతో లావాదేవీలు సక్రమంగా ఉండవు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

కళత్ర ఆరోగ్యం జాగ్రత్త. వృత్తిలో మార్పు చేర్పులు. దైవకార్యాలలో పాలుపంచుకోవడం మంచిది. దూరవార్తాశ్రవణం ప్రయోజనకారి. వ్యాపారులకు కొంతవరకు మేలు. ఊహలు తారుమారవుతాయి. అనుకొన్నవి జరుగకపోవచ్చు. మోసపోయే అవకాశాలున్నాయి. అలసట, శ్రమ ఉంటుంది. ఆహార విషయంలో జాగ్రత్త లేకుంటే ఆరోగ్యభంగావకాశాలు. నూతన గృహోపకరణాలు కొంటారు..




ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

భవిష్యాదాయాలను ఊహించి ఖర్చులు చేస్తారు. అభిప్రాయభేదాలు తొలగి కళత్ర సంబంధాలు మెరుగుపడతాయి. వృత్తిలో మార్పు చేర్పులు. ఆర్థికలావాదేవీలు సరియైన రీతిలో నిర్వహిస్తారు. దైవ కార్యాలలో పాలుపంచుకోవడం మంచిది. దూర వార్తాశ్రవణం ప్రయోజనకారి. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. భాగస్వామ్య విషయాలపై శ్రద్ధ చూపిస్తారు.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

నూతన వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి. జనసంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు శుభకార్యాల్లో పాల్గొంటారు. ప్రయాణాలు, చర్చల విషయంలో కొంత మెలకువగా ఉండాలి. పితృ సంబంధీకుల నుండి మంచి వార్త వింటారు. ధనవిషయాలలో లోటు లేదు. వివిధమార్గాలలో ధనప్రాప్తి అవకాశాలు. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. వ్యాపారులు భాగస్వాములతో జాగ్రత్త.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

అనుకొన్నవన్నీ సాగించుకొంటారు. కుటుంబసభ్యుల అవసరాలను గుర్తించి వారికి అందేట్లు చేస్తారు. బాంకు నిల్వలు పెంచే పథకాలు తయారు చేస్తారు. వృత్తిరీత్యా మంచి అభివృద్ధి ఉంటుంది. సంతానమూలంగా తృప్తి లభిస్తుంది. బంధుమిత్రులను, గురుతుల్యులను కలుసుకొంటారు. శుభకార్యాలలో మీ పాత్ర చక్కగా నిర్వహిస్తారు. ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. స్పెక్యులేషన్ లాభిస్తుంది.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండుట మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. ఆర్థికలావాదేవీలు జాగ్రత్త. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. విద్యార్థులు చదువు విషయంలో శ్రద్ధ చూపాలి.

ఒకే నక్షత్ర జననమైనా వివాహానికి అభ్యంతరం లేదు!

పి.శేషాద్రిశర్మ నెల్లూరు

** యువతీ యువకులు ఒకే నక్షత్ర జననం గనుక కుదరదన్నారు.*

'ముహూర్త దర్పణం' అనే గ్రంథంలో దంపతులు రోహిణి-ఆరుద్ర, మఖ, విశాఖ, పుష్యమి, శ్రవణం, రేవతి, ఉత్తరాభాద్రతో ఒకే నక్షత్ర జననమైనా వివాహానికి ఎట్లాంటి అభ్యంతరం లేదని వుంది.

కేతవరం సుధాకర్‌రెడ్డి కడప

** గృహారంభం రోజు ఎనిమిది పుంజులు, ఒక పొట్టేలు బలి ఇవ్వాలన్నారు?*

28 మంది ప్రాచీన భృగు, మయ, అగస్త్య వాస్తు శాస్త్రాల్లో 'రక్తబలి' విధానం లేదు. రక్తబలి ఇచ్చిన గృహాల్లో దుష్టశక్తులు వచ్చి చేరుతాయి. మూర్ఖుల మాటల్ని నమ్మి నాశనం కాకండి.

తిరుపతిరెడ్డి ఓబయరెడ్డి కడప

** నాడీ పొంతనం లేదని మంచి సంబంధాన్ని పాడు చేశారు.*

రాశి, దిన, మహేంద్ర మైత్రి వున్నప్పుడు 'రజ్జు' కూటమి లేకపోయినా పర్వాలేదని చింతామణి మార్తాండం చెబుతోంది.

మహమ్మద్ గౌసియాబేగం నెల్లూరు

** అపార్టుమెంటు ప్రహరీగోడ నైరుతి, వాయువ్యాల్లో పెరిగి, మా ప్లాటు ఆగ్నేయం పెరిగింది.*

మానసిక ఒత్తిళ్లు, వ్యాధి, ఋణగ్రస్తతతో అక్కడి వారు బాధపడతారు. మీ యింట భార్యా భర్తల మధ్య వివాదాలు తలెత్తుతాయి. ఆగ్నేయం బెడ్‌రూంలో గాక నైరుతిలో నిద్రించండి.

పి.సత్యనారాయణ వరికుంటపాడు

** కలియుగ సంవత్సరం ఏమి వస్తుంది. ఆయన 1928 – 29లో జన్మించారు.*

అది 'విభవ' నామ సంవత్సరమవుతుంది. కలియుగ సంవత్సరం 5029 అవుతుంది.

పుట్టాక షర్మిళారెడ్డి బెంగుళూరు

** ప్రహరీ లోపల పెరట్లో తులసి చెట్టు, బయట ఫెన్సింగులో జిల్లేడు చెట్టు వేసుకోవచ్చా?*

మీ పేర లక్ష్మీతులసి వస్తుంది. పెరట్లో ప్రదక్షిణ మార్గం వున్నచోట కోటలో పెట్టుకోండి. బయలు ప్రాంతమైనా 'జిల్లేడు'ను పోషించి పెంచరాదు.

కె.ఎన్.ముత్తురాణి చెన్నై

** ఉత్తరపు ఇల్లు. ఇద్దరు మరుదులు మరణించారు. ఆడపిల్ల పుట్టింది.*

తూర్పు హద్దు నిర్మాణం. పశ్చిమం పల్లం మగవాళ్లపై ప్రభావం చూపాయి. దక్షిణ ప్రహరీ నిర్మించుకోండి. ఇంటి ఆగ్నేయం, బయటి ఆగ్నేయం గదుల్లో ఏదో ఒక గదిలో మాత్రమే వంట చేయండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

కె.వి.ప్రణవీనాథ్ ఆత్మకూరు

** యోనికూటంలో పరస్పర విరుద్ధాలున్నాయట. మేమిప్పుడేం చేయాలి?*

బ్రాహ్మణులకు గ్రహ మైత్రి చూస్తారు. శూద్రులకైతే యోని కూటమి చూస్తారు. శాస్త్రం తెలియని అతన్ని సందర్శించకండి.

కరిగుంట శేషాద్రిరెడ్డి కడప

** బుధవారం కలసి వస్తుందట. రాహుకేతు పీడలున్నాయట?*

శాస్త్రం తెలియని వాళ్లు ఏదో ఒకటి చెప్పి మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తుంటారు. ఛాందసాలు, సోమరితనం మాని రోజుల కోసం ఎదురుచూడక పని వున్నప్పుడు వెంటనే ప్రారంభించి శ్రమించి పనిచేయడం నేర్చుకోండి.

టి.వి.రాధా హిమబిందు సూళ్లూరుపేట

** మావి భరణి, ఉత్తరాభాద్ర నక్షత్రాలు. వివాహం చేసుకోవచ్చా?*

ఆగ్నేయ దిక్కుకు చెందిన 'కౌముది' శక్తిలో మీ రెండు నక్షత్రాలూ చేరి వున్నవి. గనుక నిరభ్యంతరంగా వివాహం చేసుకోవచ్చు.

వై.వి.ఎన్.జి.కుమార్‌రెడ్డి వాకాడు

** నక్షత్రములు వృతిరేక దిశలో వున్నాయని వివాహాన్ని ఒప్పుకోవడం లేదు. మీరైనా చెప్పండి.*

భూతవర్గులో పంచ భూతాలలో అగ్ని, జల రాశులు పనికిరావు. అశ్వని, పృధ్వి వస్తున్నది గనుక వివాహం చేసుకోవచ్చును.

● కార్పొరేటర్‌పై కక్ష

ప్రజలపై తీర్చుకొంటున్న వివేకా!

మాజీ కార్పొరేటర్ రూప్‌కుమార్ యాదవ్ మీద కక్షతో నెల్లూరు మూలపేటలోని పాట్టి శ్రీరాములు విగ్రహం నుంచి డైకస్‌రోడ్డులోని చేపల మార్కెట్ వరకు రోడ్డు వేయకుండా అడ్డుకోవడం సమంజసమా?

గత అయిదు సంవత్సరాల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని చేసిన ప్రయత్నాలన్నీ నీరుగారి పోయాయి. అధికార పార్టీకి చెందిన నేతల మాటలకే అధిక ప్రాధాన్యతనిచ్చిన అధికార్లు ప్రజల అవసరాలు, ఇబ్బందుల గురించి పట్టించుకోవడం పూర్తిగా మానే శారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని, అధికారుల అలసత్వాన్ని వెక్కిరిస్తూ స్వాగతం పలుకుతుంది నగరంలో మూలాపేటకు వెళ్లే రోడ్డు. డైకస్ రోడ్డులోని చేపల మార్కెట్ నుంచి మూలాపేటలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వైపువెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారి చాలా సంవత్సరాలయ్యింది.

మునిసిపాలిటి నుంచి కార్పొరేషన్‌గా మార్పు చెందిన తర్వాత జరిగిన ఎన్నికలలో ఈ ప్రాంతానికి తెలుగుదేశం పార్టీకి చెందిన రూప్ కుమార్ యాదవ్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కార్పొరేషన్‌పై పెత్తనం చేయడంతో రూప్‌కుమార్ ఆనం వర్గంలో చేరి పోయాడు. తన డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్న ఆశతో ఆనం గూటిలో చేరిన కార్పొరేటర్‌కు అనంతరం అక్కడ చుక్కెదురయ్యింది. ఆనం వర్గంలోకి వెళ్లిన నాటి నుంచి ఒక్కపని కూడా చేయించుకోలేక పోయాడు.

ఈ రోడ్డును సిమెంటు రోడ్డుగా మార్చాలని అనేక పర్యాయాలు కార్పొరేషన్ అధికారులకు ప్రతిపాదించడం జరిగింది. ఆనం వర్గం నుంచి వ్యతిరేకత రావడంతో అధికారులు ఈ రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోకుండా వదిలేశారు. ఈ రోడ్డు ముందు భాగం, చివరి భాగంలో సిమెంటు రోడ్డు నిర్మాణాలు పూర్తి చేశారు. మధ్యలో వున్న ఈ రోడ్డు నిర్మాణంపై మాత్రం ఇంజనీరింగ్ విభాగానికి కనికరం కలగలేదనిపిస్తుంది. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా వుండడం వలన పొదలకూరు రోడ్డు, బుచ్చి, జొన్నవాడ ప్రాంతాల వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ రోడ్డు మీదుగా నగరంలోకి ప్రవేశి స్తుంటాయి.

రోడ్డు అధ్వాన్నంగా వుండడం వలన రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. కార్పొరేటర్ ఆనం వర్గం నుంచి బయటకు రావడంతో ఈయన డివిజన్‌లో పనులు మంజూరు కాకుండా నిలిచిపోయాయి. వర్గ రాజకీయాల కారణంగా నేటికీ ప్రజలు ఇబ్బంది పడుతూనే వున్నారు. అయిన వారిని అందలం ఎక్కించే ఆనం సోదరులు తమకు గిట్టని వారిపై వివిధ రూపాల్లో ఇబ్బందులకు గురి చేయడం అల వాటు. ఆనం అనుచరులకు సంబంధించిన డివిజన్లలో మాత్రం అవ సరం వున్నా లేకపోయినా కోట్ల రూపాయల పనులు జరిగాయి. కార్పొ రేషన్ పాలకవర్గం గడువు ముగిసిపోయినా కూడా ఆనం అనుచరుల డివిజన్లలో పనులు మంజూరుకు ప్రతిపాదనలు చేస్తున్నారు.

నిర్మాణాలకు నోచుకోని రోడ్లు నగరంలో అనేకం వున్నాయి.



బాగా దెబ్బతినిపోయిన మూలపేటలోని పొట్టిశ్రీరాములు సెంటర్ రోడ్డు.

నగరంలో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు రాష్ట్రప్రభుత్వం కోట్ల రూపా యల నిధులు విడుదల చేస్తుంది. అయితే ఈ నిధుల్ని అధికారపార్టీకి చెందిన నేతలు సూచించిన ప్రాంతాలలో ఖర్చు చేస్తూ మిగిలిన ప్రాం తాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఎన్నో సంవత్సరాలుగా అభి వృద్ధికి నోచుకోని మూలాపేట రోడ్డును ఇప్పటికైనా నిర్మించాలని ప్రజలు కోరుకొంటున్నారు.

ఛత్ర చట్టం

● లైంగిక వేధింపుల నియంత్రణ చట్టంతోనైనా...

అతివలకు న్యాయం జరిగేనా?

మహిళల హక్కులు, లైంగిక వేధింపుల నియంత్రణ కోసం ఎన్ని చట్టాలు రూపొందించినా అమలులోకి వచ్చే నాటికి వాటికి తూట్లు పడుతున్నాయి. ఫిర్యాదు చేసిన బాధితులకు సకాలంలో న్యాయం జరగక పోగా వేధింపులు మరింత ఎక్కువవుతున్నాయి.

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో మహిళ లపై జరిగే వేధింపుల నియంత్రణ కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేక బిల్లును తీసుకు రానుంది. ఈ వారంలో మొదలైన శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేసేందుకు కసరత్తు జరుగుతుంది. ఏ రూపంలోనైనా మహిళలను లైంగికంగా వేధిస్తు న్నారన్న ఆరోపణలు రుజువైతే 50 వేల రూపా యలు జరిమానా విధించే అవకాశం వుంది. ఇందుకోసం జిల్లా, మండలస్థాయిలో ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటుచేస్తారు. ఈ బిల్లు ఆమోదం పొందితే ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పనిచేసే మహిళలపై వివిధ రకాలుగా జరిగే లైంగిక వేధింపులకు బ్రేక్‌పడే అవకాశం వుంది.

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పని చేసే వారితోపాటు, వివిధ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే మహిళలు, వినియోగదారు లకు సైతం ప్రత్యేక చట్టం వర్తింపచేస్తారు. అలాగే విద్యార్థినులు, ఆసుపత్రిలో వుండే మహిళా రోగు లను కూడా ఇందులో చేర్చనున్నారు. ఇటీవల జరి గిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో ఈ బిల్లును ఆమోదించడం జరిగింది. ఈ చట్టం అమల్లోకి వస్తే మహిళల హక్కులకు రక్షణకు భంగం వుండదు. శారీరకంగా తాకినా, ప్రయత్నించినా, లైంగిక సాయం కోసం అభ్యర్థించినా, పెడార్థాలు వచ్చే విధంగా మాట్లాడినా, నీలిచిత్ర దృశ్యాలు చూపిం చినా, లైంగిక కోరిక తీర్చాలని వ్యక్తపరచినా వేధిం పుల క్రింద పరిగణిస్తారు.

కొత్తగా రూపొందించబడే ఈ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. ప్రతి కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం వుంటుంది. లైంగిక వేధింపుల క్రింద స్వీక రించిన ఫిర్యాదులపై 90 రోజుల్లో విచారణ పూర్తి చేసి 60రోజుల్లో జిల్లా కమిటీ చేసిన సిఫార్సులను సంబంధిత సంస్థ అమలు చేయాల్సి వుంటుంది. ప్రత్యేక చట్టం అమలుపై మార్గదర్శకాలు కూడా రూపొందించింది. శీతాకాల పార్లమెంటు సమావే శాల్లో బిల్లు ఆమోదం పొందితే వెంటనే అమల్లోకి వస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మహిళల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై ఇప్పటి వరకు ఫిర్యాదు చేయాలంటే భయపడేవారు.

ప్రత్యేక చట్టం రూపొందితే ఇటువంటి వారి ఆగడాలను నియంత్రించడంతోపాటు నేరం రుజు వైతే 50వేల రూపాయలు జరిమానా విధిస్తారు. 2005వ సంవత్సరంలో రూపొందించిన గృహ హింస చట్టంతో సంబంధం లేకుండా దానిని అమలు చేస్తారు. గృహహింస చట్టం క్రింద పోలీ సులు కేసు నమోదు చేసే వారు. అయితే ఈ ప్రత్యేకచట్టం ద్వారా పోలీసుల ప్రమేయం లేకుండా చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతు న్నాయి. జిల్లా మండలస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలకే పూర్తి అధికారం అప్పగించి ఫిర్యాదు లను పరిష్కరింప చేయాలని నిర్ణయించారు.

మహిళల హక్కులు, లైంగిక వేధింపుల నియంత్రణ కోసం ఎన్ని చట్టాలు రూపొందించినా అమలులోకి వచ్చే నాటికి అనేక తూట్లు పడుతు న్నాయి. ఫిర్యాదు చేసిన బాధితులకు సకాలంలో న్యాయం జరగకపోగా వేధింపులు మరింత ఎక్కు వవుతున్నాయి. దీంతో బాధితులు ఫిర్యాదు చేసేం దుకు ముందుకు రాకుండాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించి అమలు చేసే ఈ ప్రత్యేక చట్టం ఎటువంటి ఫలితాలు సాధించి బాధి తులకు న్యాయం చేస్తుందో వేచి చూడాలి.



షాపింగ్ మాల్ బాగుంది!


✍ అల్లూరు రహీం

వాస్తవానికి దగ్గరగా వున్న విషాద ప్రేమకథా చిత్రం షాపింగ్ మాల్. తమిళంలో విజయవంతమైన ఈ చిత్రాన్ని సంతోషం సినీ పత్రిక అధినేత సురేష్ కొండేటి తెలుగులోనికి అనువదించాడు. మంచి కథ, స్క్రీన్‌ప్లేకు పాటలు కూడా తోడైతే ప్రేక్షకులను సీట్లలో నుంచి లేవకుండా చేయవచ్చునని ఈ చిత్ర దర్శకుడు బి.వసంతబాలన్ చాటి చెప్పాడు. ఈ చిత్రంలో కథే హీరో. హీరో, హీరోయిన్లు కొత్తవాళ్లు. స్టార్ ఇమేజ్ వున్న నటీనటులు ఈ చిత్రంలో లేరు. చెన్నై రంగనాథన్ వీధిలో కిటికిటలాడుతుండే షాపింగ్ మాల్‌లో పనిచేసే యువతీ యువకుల జీవితాలను దర్శకుడు సెల్యూలాయిడ్‌పై అద్భుతంగా తెరకెక్కించాడు. చిత్ర కథనంలో ప్రేమానురాగాలు, భావోద్వేగాల సన్నివేశాలు కోకొల్లలు. పేదరికాన్ని డబ్బు చేసుకొంటూ షాపింగ్ మాళ్ల నిర్వాహకులు చేయించే వెట్టిచాకిరిని మనసుకు హత్తుకుపోయేలా చిత్రీకరించాడు. అక్కడ పనిచేసే అబ్బాయిలు, అమ్మాయిలు పడే ఇబ్బందులు, పర్యవేక్షకులు, యాజమాన్యాల దాష్టీకాలు పంటి బిగువున భరిస్తూ పడే వేదన హృదయాన్ని మెలితిప్పేస్తాయి. కానీ ఇటువంటి చోటే రెండు ప్రేమ కథలు పుడతాయి. మధ్యలోనే ఓ ప్రేమ కథ ముగుస్తుంది. రెండో ప్రేమకథ హీరో, హీరోయిన్లది. సమస్యల పద్మవ్యూహాన్ని ఎదిరించి మరీ ఒకటైన ప్రేమికులు విధికి ఎదురీదుతూ ఒకటయ్యే సన్నివేశం అద్భుతం. ప్రేయసీ, ప్రియులు చేతివేళ్లను తాకిస్తూ ప్రేమను వ్యక్తంచేసే సన్నివేశాలు కొత్తగా తోస్తాయి. అదేవిధంగా హీరో, హీరోయిన్లు చదువుకొనే రోజుల్లో నడిపిన ప్రేమకథలు తమాషాగా వుంటాయి. స్కేల్‌పై హీరో ఐ లవ్ యు అని చెక్కితే దాన్ని హీరోయిన్ అపురూపంగా హోమ్‌లో అర్ధరాత్రి దుప్పటి కప్పుకొని మరీ చూడడం బాగుంది. కళ్లు లేకపోయినా షాపింగ్‌మాల్ వీధిలో చిరు వ్యాపారం చేస్తూ బ్రతికే ఓ తాత, ఓ విధి వంచితురాలు, చిత్తు కాగితాలు ఏరుకొనే పాత్రధారులను కూడా కథలో భాగం చేసిన తీరు ప్రశంసనీయం. ఈ చిత్రానికి పాటలు ప్రాణం పోసాయి. జి.వి.ప్రకాష్ సంగీతం కూర్చిన కథలు చెప్పే కనులు తేవే, తన రూపం గొప్పది కాదంటా, మండే వెన్నెల, నా ప్రాణం నువ్వే చరణాలతో సాగే పాటలు బాగున్నాయి. వీటిని తెలుగు పరిశ్రమలోని గేయ రచయితలు వెన్నెలకంటి, చంద్రబోస్, సుద్దాల అశోక్‌తేజ, వనమాలి భావార్థం చెడకుండా వ్రాశారు. నెల్సూరీయుడు శశాంక్ వెన్నెలకంటి ఈ చిత్రానికి కష్టపడి వ్రాసిన పాడి మాటలు మనసులను పిండేస్తాయి. చాలా సన్నివేశాల్లో తమిళంలో వివిధ బోర్డులు కనపడడమే ఈ చిత్రంలో విసుగన్పించే అంశం. అది లేకుండా చేసి వుంటే బాగుండేది.

చిత్ర సమీక్ష

ఇక చిత్రకథలోనికి వెళ్తే ఇంటర్మీడియట్‌లో 90 శాతం మార్కులతో పాసైన శివ(మహేష్) తండ్రి చనిపోవడంతో కుటుంబ భారం మోయను చెన్నైలోని సెంథిల్ మురుగన్ స్టోరులో చిరు ఉద్యోగిగా చేరుతాడు. ఇక్కడే కుటుంబ ఇబ్బందులతో ఉద్యోగం చేస్తుండే రాణి(అంజలి)ల మధ్య కాస్త కెమిస్ట్రీ జరిగాక ప్రేమ జనిస్తుంది. షాపింగ్‌మాల్ అధినేత అన్నాజీ, అక్కడ వుండే ఓ రాక్షస సూపర్‌వైజర్ ఉద్యోగుల పట్ల పరమకిరాతంగా వ్యవహరిస్తుంటారు. చిన్న తప్పు చేస్తే అబ్బాయిలనైతే తీవ్రంగా కొడతారు. అమ్మాయిలనైతే చెప్పలేని చోట అసభ్యంగా నొక్కి ఇబ్బంది పెడతారు. మరో గత్యంతరం లేక వందలాది మంది ఇటువంటి పరిస్థితులలోనూ ఇక్కడే పని చేస్తుంటారు. ఇక్కడ పనిచేసే ఓ జంట ప్రేమకథ యాజమాన్యానికి తెలుస్తుంది. ఉద్యోగం పోతుందన్న భయంతో అబ్బాయి ఆ అమ్మాయిని అందరి ముందు ల-- ముండా అని నిందిస్తాడు. అంతే ఆత్మాభిమానం గల ఆ అమ్మాయి షాపింగ్‌మాల్ పై అంతస్తు నుండి దూకి చనిపోతుంది. ఈ సంఘటన తర్వాత శివ – రాణి ప్రేమ కథ కాస్త గందరగోళమవుతుంది. షాపింగ్‌మాల్ ప్రకటనలో నటి స్నేహ నటించను వచ్చిన రోజు షాపులో పనిచేసే వారిని ఎవరూ పట్టించుకోరు. దీంతో శివ, రాణిలు ఏకాంతంగా పై అంతస్తుకు వెళ్లి ప్రేమ ముచ్చట్లతో రాత్రంతా గడుపుతారు. ఉదయం ఇదంతా సిసి కెమెరాల్లో చూసిన యాజమాన్యం వీరిని తీవ్రంగా హింసించి ఉద్యోగం నుంచి తీసేస్తుంది. మరో ఉద్యోగ ప్రయత్నంలో ప్రేమికులిద్దరూ వుంటూ ఓ రాత్రి రక్షణ కోసం పేవ్‌మెంట్ మీద పడుకోగా ఓ లారీ వీరిపై దూసుక వెళ్తుంది. ఈ ప్రమాదంలో రాణి రెండు కాళ్లు కోల్పోతుంది. శివ తీవ్రంగా గాయపడతాడు. అయినా మొక్కవోని విశ్వాసంతో ఆ జంట ఒకటవుతారు. రంగనాథన్ వీధిలోనే చిరు వ్యాపారం చేస్తూ మళ్లీ కొత్త జీవితం ఆరంభించడంతో చిత్రం ముగుస్తుంది. వెండి తెరకు తొలి పరిచయమైన హీరో, హీరోయిన్ మహేష్, అంజలి అనుభవమున్న వారిలా నటించారు.

ముద్దుపెట్టిన ప్రియమణి



సినిమా అంటే కాస్త మసాలా, హీరోయిన్ అందాల ఆరబోత తప్పవు. ద్రోణ సినిమాలో బికినీ వేసి ప్రేక్షకులను కనులార్పకుండా చేసిన అందాల భామ ప్రియమణి ఇప్పుడు ముద్దు ముచ్చట్లతో వార్తల్లో వెలుగుతుంది. సుమంత్ హీరోగా కుమార్ బ్రదర్స్ నిర్మించే చిత్రంలో ప్రియమణి హీరోయిన్. ఇందులో ఆమె హీరోతో గరమ్ గరమ్ సన్నివేశాల్లో నటించిందని, లిప్ కిస్ కూడా ఇచ్చిందని ఫిల్మ్ నగరంతా కోడై కూస్తుంది. ఈ సినిమాలోనే మరో హీరోయిన్ విమలారామన్ కూడా తానేమి తక్కువ తినలేదన్నట్లు బికినీ వేసి ప్రేక్షకులను రంజింప జేయనుంది. సుమంత్ కోసం కాకపోయినా హీరోయిన్లు ప్రియమణి, విమలా రామన్‌ల కోసం ప్రేక్షకులు ఈ సినిమాను చూడాలన్న ఆకాంక్షను విడుదలకు ముందు వ్యక్తం చేస్తున్నారు.

మోడలింగ్ నిలబెట్టింది!



2002లో ఫెమినా మిస్ ఇండియాగా ఎంపికైన నేహా ధూపియాను జూలీ చిత్రం బాలీవుడ్‌లో హీరోయిన్‌గా నిలబెట్టింది. కాస్త బోల్డ్‌గా నటించే ఈ భామకు ఎప్పుడూ చేతిలో చిత్రాలే. ప్రస్తుతం అక్షయ్‌కుమార్ సరసన యాక్షన్ రీప్లే చిత్రంలోనూ, విత్ లవ్‌టు ఒబామా సినిమాలోనూ నటిస్తుంది. బాలకృష్ణ సరసన పరమ వీరచక్రలో నటిస్తున్న ఆమె షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడింది. మొదట్లో కెమెరా ముందు నిల్చోవడం కొత్తగా అనిపించేది. ఆలోచనలన్నీ మారిపోయేవి. ముఖంలో భావాలు పలికించడం కష్టమయ్యేది. కాని కొన్నాళ్లకు తప్పులు తెలుసుకొన్నాను. కెమెరాకు అలవాటుపడ్డాను. సినిమాలకు ముందు మోడలింగ్ చేయడం కూడా నటిగా నా కెరీర్ బాగుండడానికి వుపయోగపడిందంటుంది.

వైవిధ్యంలేని పాత్రలు చేయను!



హీరోయిన్ భూమిక వెండి తెరపై తక్కువగా కనిపిస్తుంది. కారణమడిగితే అవకాశాలు బోలెడన్ని వస్తున్నాయి. వాటిలో వైవిధ్యం ఏమాత్రం లేదు. అటువంటి సినిమాలు చేసి బుర్ర పాడుచేసుకోవడం తప్ప ప్రయోజనం కన్పించదు. అందుకే మనసుకు నచ్చిన ఒక ట్రెండు పాత్రలను ఒప్పుకొంటున్నానంది. తన పెళ్లి సినిమా జీవితానికి అడ్డే కాదని తేల్చి చెప్పింది భూమిక.

పాపం... త్రిష!



బాలీవుడ్ చిత్రం కట్టామీఠా షూటింగ్ సమయంలో హీరోయిన్ త్రిష ఎన్నో కలలు కంది. దర్శకుడు ప్రియదర్శన్, హీరో అక్షయ్‌కుమార్‌ల సహకారంతో తాను బాలీవుడ్‌లో నిలదొక్కుకొంటానని భావించింది. నా హిందీ బాగానే వుందంటూ మరో హిందీ సినిమాను సైతం ఒప్పుకొంది. ఏమాయ చేసావె హిందీ రీమేక్‌నే ఆ సినిమా. గౌతమ్ మీనన్‌నే దర్శకుడు. కట్టామీఠా బాక్సాఫీసు దగ్గర బోల్తా కొట్టేసరికి త్రిషకు మైనస్ మార్కులు పడ్డాయి. త్రిష బాలీవుడ్‌కు పనికిరాదనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ చిత్రం నుంచి మొత్తానికి ఆమెను తప్పించారు. కాని ఈ విషయాన్ని త్రిష ఒప్పు కోవట్లేదు. నన్నెవరూ తప్పించలేదు. నా కాల్‌షీట్లు సర్దుబాటు కాలేదంతే. నేనేమి బాలీవుడ్‌ను లక్ష్యంగా చేసుకొని అక్కడికి వెళ్లలేదని, తన దృష్టంతా దక్షిణాది చిత్రాల మీదే అంటూ కొత్త పాట పాడుతుంది.

నిర్మాతగా దియామీర్జా!



హైదరాబాద్ అమ్మాయి దియామీర్జా డజనుపైగా హిందీ సినిమాల్లో హీరోయిన్‌గా నటించింది. ఉన్నట్టుండి ఈ అమ్మడు తన స్నేహితుడు అర్బాజ్‌ఖాన్‌తో కలసి చిత్ర నిర్మాణంలో అడుగుపెట్టింది. ఇంత ధైర్యం ఎందుకు చేస్తున్నారంటే సినిమాలో జయాపజయాలు మామూలే. అయితే ఇప్పుడు చిత్రరంగంలోకి కొత్తతరం ప్రవేశించింది. కొత్త రక్తంతో అద్భుతాలు సృష్టించే సమయమిది. సినిమా సక్సెస్ కాదని భయపడబళ్లేదు. మంచి కథను ఎంచుకొని అడుగేస్తే తప్పకుండా విజయం సాధించగల మంటుంది. త్రీ ఇడియట్స్, చక్ దే ఇండియా, రాక్‌ఆన్, ఉడాన్ స్ఫూర్తితోనే తన చిత్రం తయారవుతుందని ధీమాగా చెబుతుంది దియా.

నరకలోక లోగిళ్లు నెల్లూరు రోడ్లు!



కొండాయపాళెం గేటు వద్ద బాగా దెబ్బతినిపోయిన ట్రంకురోడ్డు.

ఎవరికీ పట్టదేమి?

గత నెలలో కురిసిన వర్షాలు, ఈ నెలలో జల్ తుఫాను మూలంగా కురిసిన వర్షాలకు నెల్లూరు నగరంలోని రోడ్లు బాగా దెబ్బతినిపోయాయి. నగరంలోని అయ్యప్పగుడి నుంచి మద్రాస్ బస్టాండ్ వరకు రోడ్ల విస్తరణకు ఎమ్మీ వెంకయ్యనాయుడు ప్రత్యేక నిధులిప్పించారు. మద్రాసు బస్టాండ్ నుండి ఆత్మకూరు బస్టాండ్ వరకు రాష్ట్ర నిధులతో రోడ్లు అభివృద్ధి పరిచారు. కానీ ఈ నిధులను సక్రమ వినియోగంలో అధికార యంత్రాంగం విఫలమయ్యింది. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రంకు రోడ్డుగా పిలవబడే రోడ్డంతా గుంటలు పడి పోయింది. ఈ మధ్య ఈ రోడ్డు మధ్యలో కట్టిన డివైడర్ల వల్ల వర్షపునీరు పోయే అవకాశం లేక నిప్పో, ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్, బొల్లినేని హాస్పిటల్, కెవిఆర్ పెట్రోల్‌బంకు, శాంతినగర్ కూడలి, విఆర్‌సి, గాంధీబొమ్మ, కనకమహల్, ఆత్మకూరు బస్టాండ్ వద్ద రోడ్డు రోత పట్టి పోయింది. గంట వర్షం వస్తే ఈ సెంటర్లకు పడమర వైపున వున్న రోడ్ల నుంచి వచ్చే వర్షపు నీటిలో ద్విచక్ర వాహనాలు ముందుకు కదలని పరిస్థితి నెలకొంటుంది. శాంతినగర్ కూడలితోపాటు వహాబ్‌పేట, లీలా మహల్ జంక్షన్, గాంధీ బొమ్మ, రాధా థియేటర్ సందుల వద్ద వాగుల మాదిరి నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఈ రోడ్లు పల్లం కావడం మెయిన్ రోడ్డు ఎత్తుకావడంతో వర్షమొచ్చినప్పుడు ఈ రోడ్లపై డ్రైనేజి పొంగి పొర్లుతుండడంతో దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయి. కావు వీధి మినహా ఆచారివీధి వరకు అన్ని అడ్డ రోడ్డుల్లో రోడ్డు దెబ్బతిని పోయి వుంది. తూర్పు వైపు బృందావనం నుంచి మూడు హాళ్ల వరకు వేసిన సిమెంటు రోడ్డుపై ఈ వారం కురిసిన వర్షాలకు మోకాలు లోతు నీరు నిలబడి పోయింది. రైల్వే అండర్ బ్రిడ్జిల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కొద్ది పాటి వర్షానికే నీటితో నిండి పోతాయి. నగరంలోని రోడ్లకు తాత్కాలిక మరమ్మత్తుల పేరుతో కోట్లాది రూపాయలు దిగమింగే కన్నా శాశ్వత మరమ్మత్తులకు ఇకనైనా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

● చినుకురాలితే చాలు...

నెల్లూరెంత సుందరముదనష్టం!



నెల్లూరు చిన్నబజారులో రోడ్డుపై పేరుకపోయిన చెత్త.

నెల్లూరు కార్పొరేషన్ అయ్యి ఐదేళ్లయ్యింది. కానీ ఇక్కడ పనిచేసే అధికారులు, సిబ్బంది ఆలోచనలు మాత్రం మూడవ గ్రేడు మునిసిపాలిటీలో పనిచేసే వారిలా వుంటున్నాయి. మరీ ముఖ్యంగా పారిశుద్ధ్య విభాగంలో రెండు వేల మంది కార్మికులు పనిచేస్తున్నా ఏ రోజు నగరం పరిశుభ్రంగా కనపడదు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్లుండే వీధుల్లో మాత్రం ప్రతినిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ఊరు కోవడం రివాజుగా మారింది. కార్పొరేషన్ అయ్యాక పది కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి డస్ట్‌బిన్లు, ప్రత్యేక చెత్త తొలగింపు వాహనాలు, చిన్నట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో కొన్నారు. కానీ వీటిని పనిలో ఉపయోగించరు. జల్ తుఫాను ప్రభావంతో మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు నగరంలో పారిశుద్ధ్యం పాతరయ్యింది. నిత్యం వేలాది మంది ప్రజలు వచ్చి కొనుగోళ్లు చేసే ఎసి కూరగాయల మార్కెట్‌లో కూడ ఈ మూడు రోజులు చెత్తాచెదారాలు తొలగించలేదు. డైకస్‌రోడ్డులోని చేపల మార్కెట్, చిన్నబజారులోని పండ్ల మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి. ఎసి సుబ్బారెడ్డి విగ్రహం వద్ద రెండోసారి చేపడుతున్న డ్రైన్ రిపేరు వల్ల ఈ ప్రాంతం గబ్బుగబ్బుగా తయారయ్యింది. డాక్టర్ల క్లినిక్కులు వుండే పొగతోట, బృందావనం ప్రాంతాల్లో చెత్తంతా రోడ్లమీద ఎత్తకుండా వుండింది. 7వ తేది వైఎస్ జగన్ సభ జరిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలోని రాయాజివీధి మొగుదాలలో చెత్తకుండీ నిండి వీధంతా చెత్త పరుచుకొని వుండింది. జెండావీధి, మన్సూర్‌నగర్ ప్రాంతాల్లో పేరుకపోయిన చెత్త ఎత్తకపోవడంతో గబ్బుగబ్బుగా వుంది. మురిగిన చెత్త గబ్బుకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు వద్ద ముక్కు మూసుకొని నడవాల్సిందే. కలక్టరేట్ ఎదురుగా నిలబడిపోయి వున్న మురికి నీరులో చెత్తంతా నానుతుంది. 7వ తేది సాయంత్రం కలక్టరేట్‌లో మంత్రి రామనారాయణరెడ్డి నిర్వహించిన తుఫాను సమీక్షలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపర్చే విషయంలో కార్పొరేషన్ విఫలమయ్యిందని కమిషనర్‌ను ఫోన్‌లో మందలించారు. తుఫాను సమయంలో విద్యుత్ వున్నా నీటి సరఫరా చేయకపోవడాన్ని నిందించారు. ఇంత మొత్తినా 8వ తేది ఉదయం కార్పొరేషన్ శానిటరీ విభాగం పర్యవేక్షకుడు శివనాగేశ్వరరావు కలెక్టర్ బంగళా పరిసర ప్రాంతాల్లో చెత్త ఎత్తిస్తూ కనపడ్డారు. కుంభవృష్టి పడ్డాక కూడా చెత్త విషయంలో పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తే విష జ్వరాలు, కామెర్లతోపాటు మెదడువాపు వ్యాధి విజృంభిస్తుందన్న కనీస జ్ఞానం కార్పొరేషన్ శానిటరీ విభాగం అధికారులకు లేకపోవడం బాధాకరం.



కలక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి, అధికార యంత్రాంగం.

అధికార యంత్రాంగం పనితీరు భేష్!

జిల్లా ప్రజలను జల్ తుఫాను వణికించింది. మద్రాస్ – నెల్లూరుల మధ్య కేంద్రీకృతమైన తుఫాను పెనుతుఫానుగా మారుతున్నదని తీరప్రాంతాన్ని అతలాకుతలం చేయనున్నదనే హెచ్చరికలతో ప్రజలు వణికి పోయారు. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాల వారికి కంటి మీద కునుకు లేకుండా పోయింది. జిల్లా అధికారులు ఈ ప్రమాదం నుంచి ప్రజలను రక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. తీరప్రాంతాలను అప్రమత్తం చేయడంతోపాటు 12 తీరప్రాంత మండలాల్లోనూ రెవిన్యూ అధికారులకు సెలవులను రద్దు చేశారు. ఎక్కడికక్కడ అధికారులను ఎప్పటికప్పుడు సంసిద్ధులను చేశారు. కలెక్టరేట్‌లో కాల్‌సెంటర్ ఏర్పాటుచేసి ప్రత్యేకాధికారిని నియమించారు. పునరావాస కేంద్రాలను, తగినంత ఆహారాన్ని, పాలు, నీళ్ల తదితరాలను నిల్వ చేశారు. ప్రకృతి భీభత్సాన్ని ఎదుర్కొనేందుకు సమాయత్తమయ్యారు. ఈ సారి తుఫాను ముందు వివిధ చర్యలు తీసుకోవడంలో జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు ప్రతిభావంతంగా పనిచేసింది. అయితే సముద్రంపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలు మాత్రం దిన దిన గండంగా బ్రతుకు వెళ్లదీయాల్సి వచ్చింది.

ఏ పాలలో ఏ విషమున్నదో...

పాలు పోషక ఆహారం. ప్రతి ఒక్కరినీ పాలు త్రాగమని, ఎంతో బల వర్ధకమని వైద్యులు చెప్తుంటారు. కానీ ఆ పాలే నేడు విషంగా మారుతుంటే ఏం చేయాలి? నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న పాల తయారీ కేంద్రాలు, పరిశ్రమల కారణంగా ఉత్పత్తి పెరిగిపోయింది. గతంలో వ్యవసాయరంగానికి అనుబంధంగా పాడి పరిశ్రమ వుండేది. నేడు పాడి పరిశ్రమ ప్రత్యేకతను సంతరించుకొంది. రైతులు లక్షల రూపాయలు పెట్టి సంకరజాతి గేదెలను కొని పాలను అధికంగా అమ్ముతున్నారు. ఇక్కడే అసలు సమస్య ఎదురౌతుంది. డిమాండ్‌కు తగినట్లు పాలను అందించాలన్న లక్ష్యంతో పశువులకు హార్మోన్ ఇంజక్షన్లు ఇచ్చి పాలను పిండుతుండంతో ఆ పాలు త్రాగే వారిపై దుష్ప్రభావాలు ఏర్పడుతున్నాయి. ఆక్సిటోసిన్ అనే ఇంజక్షన్ ఉదయం, సాయంత్రం గేదెలకు ఇస్తుండడంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ హార్మోన్ ఇంజక్షన్ చేసిన గేదెల నుంచి తీసిన పాలను వినియోగించడం వలన ఆడపిల్లలు చిన్న వయసులోనే రజస్వల కావడం, పిల్లల్లో బుద్ధిమాంద్యం ఏర్పడడం, గర్భిణులకైతే గర్భస్రావం జరిగే ప్రమాదముందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ ఇంజక్షన్‌ను అధికంగా వాడడం వల్ల పశువులు అనారోగ్యం పాలవుతున్నాయని పశువైద్యులు చెప్తున్నారు. ఇవేమీ తమకు పట్టవన్నట్లు కొందరు రైతులు, పాల ఉత్పత్తిదారులు వీటిని ఎడాపెడా వాడుతున్నారు. ప్రభుత్వం పశువులకు వాడే ఆక్సిటోసిన్ ఇంజక్షన్ వాడకంపై నియంత్రణ పెట్టినా అక్రమంగా అమ్మకాలు జరుగుతుండడంతో పాలు త్రాగేవారు అనారోగ్యానికి గురి కావాల్సి వస్తోంది.

పాలు తాగితే ప్రాబ్లమ్స్?

తీరుమారని రవాణాశాఖ

నెల్లూరు రవాణా శాఖ కార్యాలయం తీరు మారడం లేదు. పలు అక్రమాలు అవకతవకలకు కేంద్రంగా నిలుస్తోంది. ఏజెంట్ల వ్యవస్థను రద్దు చేసినట్లు ప్రకటిస్తున్నా దళారులు లేకుండా ఏ పని కాదన్న రహస్యం బహిరంగం. ఎసిబి అధికారులు ఇటీవల జరిపిన దాడితో కార్యాలయం అవినీతి భాగోతం మరోమారు బట్టబయలైంది. వాహనం పేరు మార్చేందుకు కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ మధుసూధన్ డబ్బులు డిమాండ్ చేయడంతో ఆ వాహనదారుడు ఎసిబిని ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల సూచన మేరకు ఆటో యజమాని మూడు వేల రూపాయలను ఇచ్చే సమయంలో అతన్ని పట్టుకొని

మళ్లీ ఎసిబి దాడి

కేసు నమోదు చేశారు. దీంతో కార్యాలయంలో కలకలం రేగింది. ఎసిబి దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపడంతోపాటు రికార్డులు తనిఖీ చేయడంతో పలు అక్రమాలు బయటపడినట్లు సమాచారం. గతంలో పలువురు సిబ్బందిపై నమోదైన కేసుకు సంబంధించి ఎసిబి రహస్య విచారణ చేస్తున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం చర్చనీయాంశమయ్యింది. క్రిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారి వరకు బయటివ్యక్తులను మధ్యవర్తులుగా నియమించుకొని వారి ద్వారా కార్యకలాపాలు చక్కబెడుతున్న విషయం తెలిసిందే. ఎన్ని ఆరోపణలు, మరెన్ని ఫిర్యాదులు, అధికారుల తనిఖీలు జరిగినా ఈ కార్యాలయ సిబ్బందిలో మాత్రం లంచాల గడ్డితినే అలవాటు మారడం లేదు.

తెలంగాణా రాదని భయమా?

శ్రీకృష్ణ కమిటీ సభ్యుడు వికె.దుగ్గల్ రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామరెడ్డి ఇంటికి వెళ్లడాన్ని పెద్ద వివాదంగా మలుస్తున్నారు తెలంగాణా నేతలు. డి.రామానాయుడుకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చిన సందర్భంగా చిన్న విందు సత్కారం జరిపాడు టిఎస్ఆర్. దానిలో పాల్గొన్నాడు దుగ్గల్. సుబ్బరామరెడ్డి ఇంట్లో ఇటువంటి విందులు వారానికొకటి జరుగుతూనే వుంటాయి. ఢిల్లీలో ప్రముఖులం దరూ హాజరౌతూ వుంటారు. అంత మామూలు వ్యవహారాన్ని తెలంగాణా నేతలు అంత పెద్ద వివాదంగా మలచడం విచిత్రం. దానికి కారణం, శ్రీకృష్ణ కమిటీ నివేదిక తెలంగాణకు అనుకూలంగా రావడం లేదన్న సంకేతాలు రావడమే అని చెప్తున్నారు. రాష్ట్ర విభజనకు సరైన ప్రాతిపదిక లేదని శ్రీకృష్ణ కమిటీ భావిస్తున్న దని, వెనుకబడిన ప్రాంతం కాబట్టి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని సిఫార్సు చేస్తే, దేశంలోని చాలా ప్రాంతాలకు ఇదే సూత్రం వర్తింప చేయవలసి వస్తుందని శ్రీకృష్ణ కమిటీ అభిప్రాయపడుతున్నట్లు పుకార్లు వ్యాపిస్తున్నాయి. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పనిచేసిన దుగ్గల్, మొదట నుంచి ప్రత్యేక రాష్ట్ర వాదనలకు, ఉద్యమాలకు వ్యతిరేకి అన్నపేరు వుంది. దానితో నివేదిక రాకముందే ఆ కమిటీలోని సభ్య లను వివాదాలలోకి లాగితే నివేదికకు విలువ లేకుండా పోతుందనే వ్యూహంతో కెసిఆర్ ఈ అంశాన్ని రచ్చకెక్కించారని చెప్తున్నారు.



హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో నెల్లూరీయుడు బద్దెవోలు సుబ్బారెడ్డి నిర్మించిన జూబ్లీ రిడ్జ్ త్రీస్టార్ హోటల్‌ను ప్రారంభించి జ్యోతి వెలిగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్య. ప్రక్కన మంత్రి దానం నాగేందర్.

జగన్ జాతర

16వ పేజీ కొరవ

నన్ను అణగ తొక్కాలని చూసేవారు, ప్రజా గ్రహమనే ఉప్పెనలో కొట్టుకపోతారని భీకరంగా రణ నినాదం చేశాడు జగన్. అయితే ఆ బెదరింపు కేవలం సంకేతప్రాయమే. ఆ ఉప్పెన ఎప్పుడో, ఎక్కడ పుడుతుందో వివరణ లేదు. తన భవిష్యత్ కార్యక్రమం మీద స్పష్టత ఇవ్వలేదు. కోడె దూడ మాదిరి ఒక్క రంకె పెట్టి, సభ ముగించి, నేరుగా మద్రాసు వెళ్లిపోయాడు. అక్కడ నుంచి బెంగ ళూరు; రాజసౌధంలో విశ్రాంతి.

జగన్ సభలో కొట్టొచ్చినట్లు కన్పించిన విశే షం – మధ్య తరగతి కుటుంబాలకు చెందిన రెడ్డి కుల స్తులు, క్రిష్టియన్లు పెద్దసంఖ్యలో హాజరు కావడం. ఎప్పుడూ ఇల్లు వదలి బయటకురాని గృహిణులు కూడా కన్పించారు జనం మధ్య. వారిలో జగన్ పట్ల ఎంతో మక్కువ వుంటే తప్ప గడపదాటి బయటకు రారు. మొత్తానికి జగన్ ఓదార్పు యాత్ర నెల్లూరు జిల్లాలో సంచలనాత్మకంగా ముగిసింది. ఈ యాత్ర ఫలితంగా చాలా మందికే కాంగ్రెస్‌తో బంధం తెగి పోయింది. డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డి, ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట, కావలి మాజీ శాసనసభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, రాజీవ్‌భవన్ నిర్వాహ కులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులంతా పార్టీ నుంచి బహిష్కృతులైనట్లే లెక్క. సాంకేతికంగా పార్టీలోనే కొనసాగినా, పార్టీ నుంచి వారికి ఎటువంటి పిలుపులు వుండవు, విలువా వుండదు. రేపటి నుంచి వీరంతా ప్రతిపక్షం క్రిందే లెక్క. అధికారులు మాట వినరు. మంత్రులు దగ్గరకు రానివ్వరు. దానికి తెగబడే జగన్‌కు జై కొట్టారు కాబట్టి, ఎవరూ చింతపడకపోవచ్చు. ఇందరు పాత కాపులను దూరం చేసుకోవడం కాంగ్రెస్‌కు శుభ ప్రదమేమీ కాదు. కావలి, ఉదయగిరి నియోజకవర్గా లలో కాంగ్రెస్ కార్యకర్తలు రేపటి నుంచి అనాధల క్రిందే లెక్క. వారిని పలకరించేవారు, పనులు పుర మాయించేవారు వుండరు.

జనవాణి

2వ పేజీ కొరవ

అప్పు చేసిన వారందరికీ జాతీయ బ్యాంకుల్లో తక్కువ వడ్డీకి రుణమిచ్చే ఏర్పాటు ప్రభుత్వ పెద్దలు చేయకతప్పదు.

గడ్డం తిరుపాలురెడ్డి *పొదలకూరు*

సుందరయ్య విగ్రహం పెట్టించలేకపోయారు!

మార్క్సిస్టుపార్టీ స్థాపకుల్లో ఒకడైన పుచ్చల పల్లి సుందరయ్య స్వగ్రామం విడవలూరు మండలం లోని అలగానిపాడు. సుందరయ్య పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నాయకుడు. సైకిల్‌పై నిరాడంబరంగా పార్లమెంటుకు వెళ్లిన ఆదర్శజీవి. కాని ఆయన పుట్టిన ఊరులో సుందరయ్య విగ్రహం ఏర్పాటుకు అటు ప్రభుత్వం కాని ఇటు సిపిఎం పార్టీ గాని తగిన చర్యలు తీసుకోలేదు. జగన్ ఓదార్పుయాత్ర సంద ర్భంగా అలగానిపాడు గ్రామంలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇకనైనా ఎవరో ఒకరు చొరవ తీసుకొని ఇక్కడ సుందరయ్య విగ్రహ ప్రతి ష్టాపనకు పూనుకోవాలి.

ఎన్.మహేష్ అలగానిపాడు

శాపమా? పాపమా??

ఎయిడెడ్ స్కూళ్లు, కాలేజీల్లో పనిచేస్తున్న సిబ్బంది పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ ప్రద ర్శిస్తుంది. ఎయిడెడ్ సంస్థలలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ సిబ్బందితో సమానంగా మెడికల్ రీయం బర్స్‌మెంటు సౌకర్యం నేటికీ కల్పించడం లేదు. సిబ్బంది తమ ఖాతాలో నిల్వ వున్న ఆర్జిత శెలవును వుద్యోగ విరమణ సమయంలో నగదుగా మార్చు కోవడానికి వీలు కల్పించే ఉత్తర్వును ఇంకా వర్తింప జేయడం లేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి ఈ రెండు విషయాలపై ఇచ్చిన విజ్ఞాప నలపై సానుకూలంగా స్పందించినా విద్యాశాఖాధి కారులు తగిన ఉత్తర్వులివ్వకపోవడం బాధాకరం.

ఎ.సుధాకర్‌రావు విద్యానగర్

రోడ్డు ఎత్తు చేయకూడదు!

నెల్లూరు కస్తూరిదేవి నగర్‌లో గత 35ఏళ్లుగా కాపురముంటున్నాను. ఇటీవల కాలంలో వర్షం పడితే మా ఇంట్లోకి రోడ్డులోని నీళ్లు వచ్చేస్తున్నాయి. దీనికి కారణం రోడ్డును ఎత్తు చేయడమే. నియమ నిబంధనల ప్రకారం రోడ్డు ఎత్తు చేయకూడదు. కొత్త రోడ్డు వేయాలంటే పాత రోడ్డును చెక్కివేయాలి. ఆ పని చేయకపోవడం వల్ల నాలుగు అడుగుల ఎత్తులో కట్టిన మా ఇంట్లోకి వర్షపు నీళ్లు వచ్చేస్తు న్నాయి. కార్పొరేషన్ అధికారులు కనీస ఆలోచన చేయకుండా రోడ్ల నిర్మాణం చేపట్టడం వలన నాబోటి సీనియర్ సిటిజన్లకు ఇబ్బందులు తప్పడం లేదు.

వి.అనంతరామయ్య నెల్లూరు

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

8వ తేది సమీక్ష జరిపారు. 900 కిలోమీటర్ల మేర పంచాయితీ రాజ్ శాఖ రోడ్లు దెబ్బతిన్నాయని, వీటి తాత్కాలిక మరమ్మత్తులకు పది కోట్ల రూపాయలు శాశ్వత మరమ్మత్తులకు 50 కోట్ల రూపాయలు కావా లని అధికారులు వివరించారు. ముందు మారు మూల గ్రామాల్లోని రోడ్ల మరమ్మత్తులకు శ్రద్ధ చూప మని జడ్పీ ఛైర్మన్ అధికారులకు సూచించారు.

హైదరాబాద్‌లో మరొక నెల్లూరీయుడి హోటల్

హైదరాబాద్ నగరంలో ఏ హోటల్ కేసి చూసినా, దానివెనుక ఎవరో ఒక నెల్లూరీయుడి ప్రమే యం, పాత్ర కన్పిస్తాయి. తాజ్, కాకతీయ, మారి యట్, గ్రీన్‌పార్క్, మినర్వ, సిద్ధార్థ... ఫైవ్‌స్టార్ విలాస మందిరాల నుంచి మడత మంచాల మకాం వరకు ప్రసిద్ధమైన హోటళ్లన్నీ నెల్లూరు రెడ్లవే. కాంట్రాక్టులు, హోటళ్లలో మనవాళ్లది తిరుగులేని నైపుణ్యం.

ఈ కోవలోనే హైదరాబాదులో మరొక నెల్లూరు హోటల్ వెలిసింది. జూబ్లీహిల్స్‌లో జూబ్లీ రిడ్జ్ పేరిట 40 రూముల మూడు నక్షత్రాల బిజినెస్ హోటల్ నిర్మించాడు బద్దెవోలు సుబ్బారెడ్డి. వంశీ రామ్ బిల్డర్స్ పేరిట అపార్టుమెంట్ల నిర్మాణంతో పేరు తెచ్చుకొన్నవాడాయన. ముఖ్యమంత్రి రోశయ్య మొన్న 10తేది ఈ హోటల్‌కు జ్యోతి వెలిగించాడు. సుబ్బారెడ్డి హోటల్ మూడు గదులు, ఆరుగురు అతి థులుగా వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నాము.

ఆర్ఎస్ఎస్ ధర్నా!

ఆర్ఎస్ఎస్‌పై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుష్ప చారాన్ని నిరసిస్తూ గాంధీబొమ్మ వద్ద 10వ తేది మహా ధర్నా చేపట్టింది. మూడు గంటలసేపు జరి గిన ఈ ధర్నాలో ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బిజెపిలకు చెందిన పలువురు నేతలు పాల్గొని కాంగ్రెస్ ప్రభు త్వాన్ని దుయ్యబట్టారు. సోనియా, చిదంబరంల వ్యాఖ్యలపై విరుచుక పడ్డారు. ప్రపంచ శాంతికి సౌభాగ్యానికి కృషిచేస్తూ కుల మతాలకు అతీతంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టే సంఘ్ పట్ల కొందరు కుటిలయత్నాలతో చేస్తున్న అసత్య ప్రచా రాన్ని పలువురు నేతలు తమ ప్రసంగంలో ఖండిం చారు.

అన్నీ తప్పుడు కేసులే!

ఎస్సీ ఎస్టీల కోసం ఏర్పాటుచేసిన యాక్టు దుర్వినియోగం అవుతున్నదని, నమోదవుతున్న అధికభాగం కేసులు తప్పుడు కేసులేనని సమాచార హక్కు చట్టం కమిషనర్ దిలీప్‌రెడ్డి అభిప్రాయ పడ్డారు. సమాచార హక్కు చట్టంపై టౌన్‌హాల్‌లో 8వ తేది సమావేశం జరిగింది. దీనిలో పాల్గొన్న దిలీప్‌రెడ్డి సమాచార హక్కు చట్టం ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసులు ప్రక్కదారి పడుతున్న వైనాన్ని వివరిం చారు. స్వార్థపరులు ఈ చట్టాన్ని వాడుకొంటున్నం దున నూటికి 98 శాతం తప్పుడు కేసులు నమో దవుతున్నాయన్నారు.

చెత్తను అడ్డుకొన్న ప్రజలు

నగరంలో కార్పొరేషన్ సేకరించిన చెత్తను కల్లూరుపల్లిలో పారబోస్తుండడంతో అక్కడి ప్రజలు వాహనాలను అడ్డుకొన్నారు. నగరానికి దూరంగా డంప్ చేయాల్సిన చెత్తను ఇటీవల కల్లూరుపల్లిలో వేస్తుండడం అక్కడి ప్రజలకు ఆగ్రహం తెప్పించింది. ఎంపిటిసి సభ్యుడు ఏడుకొండలు ఆధ్వర్యంలో మునిసిపాలిటీ చెత్త తోలే వాహనాలను వారు అడ్డు కొన్నారు. డ్రైవర్లు దూరం పోవడానికి బద్దకించి ఎక్కడ పడితే అక్కడ వేస్తుండడంతో ఈ సమస్య ఎదురౌతుంది.

నృసింహునికి నిత్య కళ్యాణం

పెంచలకోనలో వెలసి వుండే లక్ష్మీ నరసింహ స్వామికి ఇక నిత్య కళ్యాణం జరుగనుంది. పాలక వర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఛైర్మన్ రవీంద్రరెడ్డి ప్రకటించారు. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతుడైన నరసింహస్వామి క్షేత్రం ఇక నిత్య కళ్యా ణం పచ్చ తోరణం కానుంది. పాలకవర్గం తీసుకొన్న నిర్ణయం భక్తులకు సంతోషం కల్గించే అంశం.

ఆర్‌కెఎం రిసార్ట్స్

ఆర్‌కె ఫామ్ ల్యాండ్స్ పేరిట కొత్తకోడూరు బీచ్‌లో రిసార్ట్స్‌ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకుడు ఎస్.విజయకుమార్‌రెడ్డి, సిహెచ్.శ్రీనివాసులు తెలి పారు. 25 ఎకరాలతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఇస్కాన్ మందిర అధ్యక్షులు సుఖదేవ్‌స్వామి విడుదల చేశారు.

ఉపాధిహామీ నిధులతో నాసిరకంగా రోడ్ల నిర్మాణం!

ఈ పథకానికి మంజూరైన నిధులతో గతంలో కాల్వలు, చెరువుల మరమ్మత్తులు చేపట్టేవారు. గ్రామీణ ప్రాంతాలలో రహదారి వసతి కల్పించాలన్న లక్ష్యంతో ఈ నిధులను కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి చివరికి చుక్కెదురయ్యింది.



వేసిన కొన్నాళ్లకే దెబ్బతినిపోయిన తోటపల్లి గూడూరు మండలంలోని పాపిరెడ్డిపాళెం రోడ్డు.

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో మంజూరు చేసిన పనులకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. 2009–10 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 605 పనులు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంతాలకు రహదారి వసతి కల్పించాలన్న సంకల్పంతో ఉపాధిహామీ పథకం నిధులను కేటాయించడం జరిగింది. ఈ పనులు మంజూరు చేసి దాదాపు సంవత్సరం గడిచిపోయింది. గ్రామీణ ప్రాంతాలలో గ్రావెల్, మెటల్ రోడ్లు నిర్మించేందుకు 2లక్షల నుంచి 30 లక్షల వరకు కేటాయించిన పనులు వున్నాయి.

2009 సెప్టెంబర్ 23న జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ పనులకు సంబంధించిన అజెండా ఆమోదించడం కూడా జరిగింది. అయితే గ్రామీణ ప్రాంతాలలో రాజకీయ జోక్యం కారణంగా ఆమోదించిన పనులలో కొన్ని నిర్మాణానికి నోచుకోలేకపోయాయి. కొన్ని ప్రాంతాలలో చేపట్టిన పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. నాసిరకంగా చేపట్టిన పనులను సంబంధితశాఖ అధికారులు ప్రశ్నించలేకపోయారు. దీంతో నిర్మాణం పూర్తి కాబడిన రహదారులు కొన్ని నెలలకే దుస్థితికి చేరుకుంటున్నాయి.


టి.పి గూడూరు మండలం పాపిరెడ్డిపాళెం ప్రధాన రహదారి నిర్మాణానికి 30లక్షల రూపాయలు కేటాయించారు. అలాగే పాపిరెడ్డిపాళెం నుంచి ఇస్కపాళెం వరకు మెటల్‌రోడ్డు నిర్మాణం కోసం మరో 15లక్షల రూపాయలు కేటాయించారు. పై రెండు పనులను రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. సంబంధితశాఖ అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో నిర్మాణ పనులు ఆశాజనకంగా సాగలేదు. 5వ నెంబర్ జాతీయ రహదారి నుంచి చెముడుగుంట ఎస్టీ కాలనీ వరకు మెటల్‌రోడ్డు నిర్మాణం కోసం 25 లక్షల రూపాయలు కేటాయించారు. ఈ రోడ్డు పనికి అధికవ్యయంతో ప్రతిపాదనలు తయారు చేశారన్న విమర్శలు వున్నాయి.

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు కేటాయించబడడంతో ఆర్‌అండ్‌బి, పంచాయితీరాజ్ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వున్నాయి. ఈ పథకం క్రింద కేటాయించే నిధులతో తూతూమాత్రంగా రోడ్లకు గ్రావెల్ చల్లి బిల్లులు మంజూరు చేయించుకొంటున్నారు. చినచెరుకూరు, కాకుపల్లి రోడ్డు నుంచి చింతారెడ్డిపాళెం ఎస్టీ కాలనీ వరకు నిర్మించిన మెటల్ రోడ్డును పరిశీలిస్తే ఎంత నాణ్యతగా వేశారో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొంత భాగం మెటల్‌పై వేసిన గ్రావెల్ లేచిపోయి అధికారులు, కాంట్రాక్టర్ తీరు వెక్కిరిస్తుంది.

పైన పేర్కొన్న రోడ్లు కేవలం ఉదాహరణ మాత్రమే. ఇటువంటివి జిల్లావ్యాప్తంగా అనేకం వున్నాయి. మారుమూల ప్రాంతాలలో రాజకీయ విభేదాల కారణంగా కొన్ని రోడ్ల పనులు ప్రారంభానికి నోచుకోకుండా పోయాయి. ఆధిపత్యం పోరులో కొన్ని పనులు నిలిచిపోగా ప్రతిపాదనలు తయారుచేసి ఆమోదం పొందిన పనుల గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారులు లేక ప్రజలు నేటికి ఇబ్బంది పడక తప్పడం లేదు.

ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా గతంలో కేవలం కాల్వలు, చెరువుల మరమ్మత్తు పనులు చేపట్టేవారు. గ్రామీణ ప్రాంతాలలో రహదారి వసతి కల్పించాలన్న లక్ష్యంతో నిధులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలో జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలను కలిపే లింకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులను నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపడితే ప్రజలు హర్షిస్తారు.

పంటలను కాపాడుకొనే పద్ధతులివే!



జువ్వలదిన్నె వద్ద స్వాంపు వరద వుధృతికి దెబ్బతిన్న నారుమళ్లు.

జులై తుఫాను ప్రభావం మూలంగా కురిసిన భారీ వర్షాల వలన జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రబీ సీజన్ కావడంతో వివిధ రకాల పంటల సాగు చేసేందుకు సమాయత్తం అయిన రైతాంగాన్ని ఈ వర్షాలు దెబ్బతీశాయి. 491 హెక్టార్లలో రబీ వరి నారుమళ్లు, 3248 హెక్టార్లలో ఖరీఫ్‌లో నాటిన వరిపైరు, 372 హెక్టార్లలో మినుము పైరు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. వీటితోపాటు ఉద్యానవన పంటలైన అరటి, తమల పాకు, కూరగాయల పంటలకు వర్షం కారణంగా నష్టం సంభవించింది. ఈ పరిస్థితులలో పంటలను కాపాడుకోను రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యల గురించి వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రవీంద్ర కుమార్‌రెడ్డి, డాక్టర్ పుల్లం రాజులు పలు సూచనలు చేశారు.

నీరు నిలిస్తే చీడపీడలు!

ఖరీఫ్‌లో నాటిన వరి పొలాల్లో నీరు నిలిచి వున్నట్లయితే ఆ నీటిని పూర్తిగా తీసివేసి ఎకరానికి 25కిలోల యూరియా, 15కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను కలిపి చల్లాలి. ఈ వాతావరణంలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు, ఆకులు కత్తిరించే పురుగు ఆశించవచ్చు. దీనికిగాను క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి చల్లి నివారించుకోవాలి. పాముపొడ, కాండం కుళ్ళు తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 2మి.లీ లేదా ప్రొపికోనజోల్ 1మి.లీ లేదా వాలిడామైసిన్ 2మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ఈ మూడు రకాలు మంచివి

రబీ వరి నారుమళ్లలో నిలచిన నీటిని తీసివేసి ప్రతి 5సెంట్ల నారుమడికి 1కిలో కార్బోప్యురాన్ 3జి గుళికలు గానీ, 500 గ్రాముల ఫోరేట్ 10జి గుళికలు ఇసుకతో కలిపి వేయాలి. నారు పోసుకోవాల్సిన పరిస్థితుల్లో ఎంటియు–1010, 1001, ఎన్ఎల్ఆర్ 34449 రకాలను వినియోగించాలి.

మినుము పంటకు సంబంధించి పొగాకు లద్దెపురుగు, కొరినోస్పారా ఆకుమచ్చ తెగుళ్ల ఆశించే అవకాశం వుంది. లద్దెపురుగు నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5మి.లీ లేదా ఎండోసల్ఫాన్ 2మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఆకుమచ్చ తెగుళ్లకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

కంది పంటను శనగపచ్చ, మరూకా మచ్చల పురుగు ఆశించే అవకాశం ఎక్కువ. దీనికిగాను వేపనూనె 5మి.లీ లేక క్లోరోపైరిఫాస్ 2.5మి.లీ లేదా క్వినాల్‌ఫాస్ 2మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

తోటలకు ఈ పద్ధతి మంచిది!

తమలపాకు తోటల్లో 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాముల ద్రావణాన్ని నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో చల్లాలి. అరటి తోటలలో ప్రతి చెట్టుకి 100గ్రా యూరియా, 80గ్రా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి వేయాలి. బ్లీచింగ్ పౌడర్‌ను లీటరు నీటిలో 25 గ్రాముల చొప్పున కలిపి ఆ ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో వేయాలి. పెసరకు సంబంధించి సాగు చేయడానికి ఎల్‌జిజి 407, 460, ఎంఎల్–267 రకాలను ఎంపిక చేసుకోవడం ఉత్తమం. ఒక్కో ఎకరానికి 6 నుంచి 7 కిలోల విత్తనాలు వాడాల్సిన అవసరం వుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

జైత్రయాత్రగా ముగిసిన జగన్ జాతర!

● *గత ఆరునెలలుగా జగన్ చేస్తున్న ఓదార్పు యాత్రలో ఏ జిల్లాలో కూడా ఇంత భారీసభ జరగలేదని చెప్తున్నారు.*



గాంధీబొమ్మ వద్ద జరిగిన ఓదార్పు ముగింపు సభలో మాట్లాడుతున్న జగన్.

జిల్లాలో జగన్ జాతర జైత్రయాత్ర వలె ముగిసింది. నెల్లూరు నగరం గాంధీబొమ్మ కూడలిలో జరిగిన ముగింపు సభ మరింత జగజ్జేయ మానమనిపించింది. నిజానికి 13తేది కావలిలో జగన్ ఓదార్పు యాత్ర మొదలు పెట్టిననాడు ఇంతేనా అన్పించిన మాట వాస్తవం. మొదటి మూడు రోజులూ చాలా పేలవంగా నడిచింది. ఒక దశలో జగన్ కూడా సహనం కోల్పోయి నిర్వాహకుల మీద కన్నెర్ర చేశాడు. జిల్లా అంతా తనకిదే దుర్గతేమో అన్న భీతితో పార్లమెంట్ సమావేశాల సాకు చెప్పి, 50 రోజుల కార్యక్రమాన్ని కాస్తా 23 రోజులకు కుదిస్తున్నట్లు ప్రకటించాడు. అయితే ఆ తర్వాత పరిస్థితిలో చాలా మార్పు. జిల్లాలో జగన్




ఓదార్పు ముగింపు సభలో జనప్రభంజనం.

భారాన్ని తమ భుజాలకెత్తుకొన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి సోదరులు పరువు పోతుందని భయపడి, ఉదయగిరిలో జన సమీకరణ ద్వారా జగన్‌ను తృప్తి పరచారు. అక్కడ నుంచి ఆ ప్రత్యేక శ్రద్ధ అవసరం లేకుండానే నడిచింది యాత్ర. ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి ఎన్ని అడ్డుపుల్లలు వేసినా జనం ఆగలేదు. విరగబడి వచ్చారు. ఒకటికి ఆరు విగ్రహాలు ఆవిష్కరింపచేసి, మంత్రిగారికి మంట పుట్టించారు. నెల్లూరు రూరల్‌లో కూడా అదే తిరుగుబాటు ధోరణి. జగన్ మీద ప్రేమలేని వారు కూడా ఆనం వారి మీద కసితో వీధులలోకి వచ్చారు. కోవూరులో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి జగన్‌ను ఆనంద డోలికలలో ఓలలాడించాడు. సర్వేపల్లి, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలలో పెద్దగా సంచలనాలు లేవు. నాయుడుపేటలో మాత్రం దడదడలాడింది సభ. చివరకు నెల్లూరు నగరం చేరే సరికి భూమి బ్రద్దలైందా అన్పించింది. రాజీవ్‌భవన్ పేరుతో గత ఏడాది కాలంగా నెల్లూరు నగరంలో దడబడలు సృష్టిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ ద్వయం జగన్‌కు మరపురాని అనుభూతిని మిగిల్చింది. నిజానికి 7తేది నెల్లూరులో రాజకీయ సభలు జరిపే సానుకూలత లేదు. పెను తుఫాను ముంచుకొని వస్తున్నదని టీవీ ఛానళ్లు జనాన్ని భయపెడుతున్నాయి. జోరున వాన. జనం వీధులలోకి వచ్చే పరిస్థితి లేదు. ఈ వాతావరణంలో జగన్ సభ ఏమి జరుగుతుంది లెమ్మని అందరూ పెదవి విరిచారు. కానీ తీరా సభ సమయానికి ఎక్కడ నుంచి వచ్చారో జనం, ఇసుళ్ల పుట్ట పగిలినట్లు, ఆకాశం నుంచి వాన చినుకులుగా వర్షించినట్లు గుంపులు, గుంపులుగా మందలు మందలుగా జనం వచ్చారు. వానను లెక్కచేయలేదు. తుఫాను భయాన్ని పట్టించుకోలేదు. ఆరు నెలలకు పైగా జగన్ చేస్తున్న యాత్రలో ఏ జిల్లాలో కూడా ఇంత భారీ సభ జరగలేదని చెప్తున్నారు.

దీనికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయి. మొదటిది నగరంలో ఆనం వారి మీద జనంలో వున్న కసి. జగన్ యాత్రలో పాలుపంచుకోవద్దని వారు ఒత్తిడి పెంచే కొద్దీ సాధారణ ప్రజలలో కూడా యాత్రకు పోతే ఏమి చేస్తారో చూద్దామన్న పంతం పెరిగింది. రెండవ కారణం – ఏడాది కాలంగా రాజీవ్‌భవన్ కాంగ్రెస్ కార్యకర్తలతో పెంచుకొన్న అనుబంధం. దశాబ్దాల తరబడి ఆనం వారి రాజకీయ కోటగా భావింప బడుతూ వచ్చిన నెల్లూరు నగరం వారి ఆధిపత్యాన్ని ధిక్కరించడంలోనే కాదు, వారి మీద ఆధిపత్యాన్ని సాధించడంలో రాజీవ్ భవన్ సఫలీకృతమైంది. దాన్ని ఆశ్రయిస్తే, ఆనం వారు తమ నేమీ చేయలేరన్న గుండె ధైర్యంతో నగరంలోని మారుమూల ప్రదేశాల నుంచి జనం స్వచ్ఛందంగా, ప్రదర్శనల రూపంలో తరలి వచ్చారు. దారి పొడవునా ఆనం వివేకానందరెడ్డిని శాప నార్థాలు పెట్టే నినాదాలతో హోరెత్తించారు.

ఈ పరిణామం జగన్‌కు సగించినట్లుంది. ఆ కుశాలతోనే కాబోలు, జిల్లాలో ఎక్కడా ఓదార్పు గురించి తప్ప మరొకమాట మాట్లాడకుండా అరిగిపోయిన రికార్డు ప్లేయర్ వలె ఉపన్యాసాలిచ్చినవాడు, ఇక్కడ కొంచెం కారం మసాలా దట్టించాడు.

కొరవ 14వ పేజీలో



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.